శీతలామందిరము

వేలాల సుబ్బారావుగారు

క్రీ. శ. 1927వ సంవత్సరం మే నెల ప్రవేశించింది. హిందూ మహమ్మదీయుల కొట్లాటలమూలాన్ని పంజాబు దేశంలో ఎక్కడ జూచినా మహా ఆందోళనంగా ఉంది. ఎవళ్ళ నోటివెంట వినబోయినా యీ గొడవే. ఎక్కడయినా నలుగురైదుగురు గుంపుగా మాట్లాడుతున్నారంటే వాళ్ళు మాట్లాడేవిషయం హిందూ మహమ్మదీయుల జగడాలనుగురించి తప్పకుండా అయివుంటుంది. సభల్లో రైళ్ళలో సత్రాల్లో నదీమార్గాల్లో స్నానాలరేవుల్లో మోటారులారీల్లో కచేరీల్లో ఎక్కడయితే నలుగురు కలవడానికి అవకాశం వుంటుందో అక్కడంతా ఈ ప్రసంగమే తప్ప మరోవిషయం వినవచ్చేదికాదు. గాంధీమహాత్ముని నాన్ కోఆపరేషన్ మూవ్‌మెంటు జోరుగా చల్లబడిపోయింది. దానికి ఇతిశ్రీకావడం, హిందూ ముసల్మాన్ కలహాన్నికి శ్రీరస్తు కావడం ఒకముహూర్తంలోనే. నైసర్గిక నియమాల ననుసరించి వేటికైనా యానసంలో కలుగుతుంది విజృంభణము. ఇది ఆనియమాలకు విరుద్ధమైంది కాబట్టే మొదలు పుట్టేపుట్టడంతోటే ముల్తాన్ నగరాన్నంతా భగ్గుమనిపించింది. అక్కడినుంచి మండూకప్లుతాలతో, మధ్యమధ్య రెండుమూడు నెలల అవకాశాలతో పంజాబులోని ముఖ్యముఖ్య పట్నాల్లో చెలరేగడం మొదలెట్టింది. క్రమక్రమంగా సహారన్‌పూర్, డిల్లీ, రేవాడీ, అమృతసరం, గుజరాన్‌వాలా, కోహాట్, రావల్పిండీ మొదలైన నగరాల్లో హిందూ మహమ్మదీయుల కిద్దరకూ ఉండే సౌఖ్యాలూ సఖ్యాలూ అన్నీ స్వాహా అయిపోయినాయి. కేవలం ముప్పైమైళ్ళ దూరంలో ఉండడంవల్ల అమృతసరం తగులబడినప్పుడు అక్కడ చెలరేగిన అగ్నిజ్వాలలసెగ లాహోరుకూడా తగిలింది కాని ఇంతవరకూ ఇక్కడి వారికి దేవతాసాక్షాత్కార భాగ్యం లభించింది కాదు. ఇంతకూ లాహోరువాళ్ళు పట్టి నిర్భాగ్యులు. ఈలాటిపిరికితనం రాజధాని వాళ్ళకు అవమానకరం గూడాను. పేరు ప్రతిష్ఠా లేని నగరాలన్నీ పేపర్లలో బడి పైకివచ్చి నలుగురినోళ్ళలో బడుతూవుంటే ఈ మహాపట్నం చచ్చినదానిలాగు పడివుండడమేమిటి? నిజంగా ఇక్కడివాళ్ళంతా నామర్దాలే– అని కలహానికి కాలు దువ్వుతూ ఉండే హిందూ ముసల్మాన్ గుండాలు కొందరు ఉక్కిరిబిక్కిరై ఉసూరుమంటూ ఉండేవాళ్ళు. మనుష్యుల మొగాలమీద నిష్కల్మషభావమనేది కనబడేదే కాదు, ఎక్కడ మాయమై పోయిందో. ఏమొగం జూచినా ఏదో అనుమానం, భయం, ఆవేగం, అసంతుష్టి, దైన్యం వీటిని సూచిస్తూ ఉండేది. ఈ కలహాగ్ని హఠాత్తుగా దేశంలో కాలుబెట్టి జనులందరి మొగాలపై తాండవమాడే కలాకాంతులతో గూడిన ఆనందరసాన్ని పీల్చేశాదా అనిపించేది. ఎటువైపు చూచినా చిన్నబోయిన మొగాలే. అంతకుమునుపు ఏప్రకారం ఉన్నప్పటికీ హిందూ మహమ్మదీయు లిద్దరూ బజార్లో ఎక్కడైనా కలిశారంటే ఇద్దరి మొగాలూ వివర్ణాలై నల్లబారుతూ వుండేవి. వ్యక్తిగతమైన విరోధంగాని, మనస్పర్ధగాని ఏవిధమైనది లేకపోయినప్పటికీ, అంతవరకూ ఒకరి నొకరు ఎరుగక పోయినప్పటికీ ఏం చిత్రమోకాని హిందూ మహమ్మదీయులు ఎదురు పడ్డారంటే ఇద్దరి మొగాల్లో అవిశ్వాసభావం ప్రత్యక్షమౌతూ ఉండేది. ఈలాంటిరోజుల్లో మే నెల రెండవతారీఖునాడు విద్యార్థు లిద్దరు రావీరోడ్డుమీదుగా లాహోరువైపు వస్తున్నారు. సాయంకాలం షుమారు ఆరుగంటలై ఉంటుంది. ఇద్దరి చేతుల్లో సంస్కృత గ్రంథాలున్నాయి. సంగతి సందర్భాలను గుర్తెరిగిన వాళ్ళకి వీళ్ళను చూడడంతోటే విద్యార్థులనిన్నీ, పగలంతా ఏరావీ తీరాన్నో చదువుకొని సాయంకాలానికి ఇండ్లకు తిరిగి వస్తున్నారనిన్నీ తెలియకపోదు. ఇద్దరికీ రెండు మూడేళ్ళ వార ఉండవచ్చు. పదిమూళ్ళ పంజాబీ ధోవతులను ఒకచివరనుంచి కట్టుకొని రెండోచివరను నడుతబెట్టి తొడుక్కొన్న షర్టుమీద ఉత్తరీయంగా వేసుకొన్నారు. ఇంతకుతప్ప వేరే ఉత్తరీయాల్లేవు. తలలమీద సోకుగా చుట్టుకొన్న పాగాలున్నాయి. కాళ్ళకు సరగాబీలు. ఒకచేతిలో పుస్తకాలకట్ట; రెండోచేతిలో చిన్న తువాలా. వీళ్ళిద్దరూ చిన్న రావీసంతెన దాటి అక్కడే దగ్గరలో రోడ్డుప్రక్కగా ఉన్న వైరాగీమందిరం ద్వారానికి ఎదురుగా రావడంతోటే గుళ్లో నుంచి మరో విద్యార్థి నవ్వుకుంటూ బయట ఊడిపడ్డాడు. ఇతనివేషం వైఖరి అంతా పైవాళ్ళలాగే ఉంది. ఇతడు కనపడడంతోటే పైవిద్యార్థు లిద్దరు–

"వంశీ! నీవు ఇవ్వాళ కైలు వంతెన దగ్గరికి వస్తానన్నావే! అక్కడి సమాచారం ముందుగానే తెలిసిందా ఏమిటి, రావడం మానేశావు? నీకోసం చాలాసేపు ఎదురుచూశాం."

అని అడిగారు. అప్పుడు వాళ్ళ కీసంభాషణ జరిగింది:

"శావాలనే, మిమ్మల్ని దోవలో కలుసుకోందామనే మన మందిరాన్నుంచి బయల్దేరాను! కాని మీయిద్దరి జాడా ఎక్కడా కన్పించిందికాదు. ఇక్కడికి వచ్చేసరికి ఎండ మహాతీవ్ర మనిపించింది. మీరు దొరకనే లేదు. ఒక్కడినీ రావడానికి పాలుమాలి ఈగుళ్లో చొరబడ్డాను."

"ఇవ్వాళ మీ కేం పేపరైంది?"

"వికల్పం. మీకో?"

"మాకు ఇవ్వాళ సాహిత్యదర్పణమైపోయింది. రేపూ, మావికల్పం."

"మీ దేం వికల్పం?"

"ముక్తావళీ. నీదో?"

"కావ్యప్రకాశం"

"బాగా రాశావా?"

"ఏదో రాశాను. అసలు గ్రంథములోని తాత్పర్యం గ్రహించడం ఎల్లా ఉన్నా మా పండితులు గారు ముఖ్య విషయాల మీద శాస్త్రార్థాలన్నీ వల్లన వేయించారు. వాటినే అక్కడ దించేసి వచ్చాను. ఇక ఇందులో తప్పిపోవడ మంటూ ఉండదుట లే."

"ఎంచేత?"

"పేపర్లని దిద్ది మార్కు లిచ్చేవాళ్లకీ ఇలా రాయడమే ఇష్టం. స్వబుద్ధిని ఉపయోగించి తమ చిత్తానికి నచ్చేలాగు రాసేవాళ్లంతా ఫేలే అవుతుంటారు."

"ప్రశ్నలకు జవాబు రాయడానికి తమ బుద్ధిని వినియోగించి రాయాలి గాని భట్టీవేయడం పనికిరా దంటారే!"

"ఈలాగని పైకి చెప్పడం మటుకే. కాని అసలు రహస్యం వేరు."

"అంటే?"

"మీ కింకా బహిరంగాలే కాని అంతరంగాలు తెలియనిలాగున్నాయి. తప్పకుండా తెలిసికొని ఉండాలి. చెబుతా వినండి. ఇంగ్లీషు దొరలు ఇక్కడికి రాకపూర్వం మనదేశంలో శాస్త్రాధ్యయనం మరోలా ఉండేది: ఆకాలంలో ఒక్కొక్క శాస్త్రాన్ని రెండు మూడేళ్లు బాగా చదువుతూ ఉండేవారు. ఆ పరిశ్రమమూలాన్ని వారికి గ్రంథాల్లోని మర్మాలు కూడా అవగత మవుతూ వుండేవి. కాని ఇప్పటి కాలేజీల పద్ధతి వచ్చిన లగాయతూ ఆ ప్రాచీన పద్ధతులని మార్చుకోవలసి వచ్చింది."

"ఎందు నిమిత్తం?"

"రెండుమూడుసంవత్సరాల్లో చదవగలిగే గ్రంథాల్ని పద్నాల్గింటిని ఇప్పుడు ఒక్క సంవత్సరంలోనే పూర్తిచేయాలాయెను. మరి ఏంచెయ్యాలి! ముఖ్యమైన శాస్త్రార్థాలన్నింటిని వల్లెవేయించి పాస్ చేయిస్తారు పండితులు. ఆ క్రమాన్ని పాసయినవాళ్లే ఇప్పుడు మన పరీక్షకులు. వీళ్లు మనం రాసి యిచ్చిన పేపర్లను చూసేటప్పుడు వాళ్లు వల్లించి ఉన్న ముక్కలు వచ్చాయా లేదా అని చూస్తారుగాని ఇది ప్రశ్నకు తగ్గ జవాబు అవునా కాదా అనిచూడరు. నానాకష్టాలు పడి, ఆరోగ్యాన్నికూడా చెడగొట్టుకొని, పశువులాగు చదివి, పరీక్షాభవనంలో కూర్చొని మనం రాసేదాన్నంతా పరికించి చూచి మార్కు లిస్తా రనుకొన్నావా ఏమిటి ఈచండాల మార్కులు! వేలకొలది విద్యార్థులు వేర్వేరుగా రాసే జవాబులన్నింటిని బాగా పరిశీలించి మార్కు లివ్వాలంటే ఒక్కనాట్లో చావడూ? వీళ్ల కంతతీరిక ఎక్కడ? ఓపిక ఎక్కడ? వేలకువేలు పేపర్లని తిరగెయ్యాలి నాలుగయిదు వారాల్లో."

"బాగా చూడ గలిగి నన్ని పేపర్లనే తీసుకుంటే?"

"ఫీసు తగ్గిపోదూ మరీ—అలా ఎప్పటికీ కాదు. అంచేతే పరీక్షకుడు పేపరు తెరచినాడంటే చేతివేళ్లు మెషీనులాగు పనిచేసి కాగితాల్ని తిరగేస్తుంటాయి. ఆసమయాన్ని పరీక్షకుని స్నాప్ షాట్ దృష్టుల్లో ఆయన అంతఃపూర్వం వల్లించిఉన్నపదాలూ, వాక్యాలూ, ఏవైనా ముక్కలూ పడ్డాయా అంటే సరే—లేకపోతే సిపరునిండా క్రాసుమార్కులే."

"మేమింకా వినలా—ఈలాగని."

"మీరు డిగ్రీపరీక్ష కాముగా—వచ్చేసంవత్సరం అన్నీ తెలస్తాయి."

"అయితే డిగ్రీలవల్ల లాభం లేదనా? నీ అభిప్రాయం."

"ఎందుకు లేదూ? ఉంది.

"ఏవిధాన్ని?"

"ఏదైనా స్కూల్లోనో కాలేజీలోనో నౌకరీ దొరికితే నాటి- మళ్లీ శిష్యులచేత ఏకరువు పెట్టించడానికి పనికొస్తుందా? ఇంకోలా సేవావృత్తిని స్వీకరించినప్పటికీ కొన్నాళ్లు అలవాటైన తరువా రాయడానికీ, చదవడానికీ, అధికారియిచ్చే ఆర్డర్లను గ్రహించడాని అవసరంబడితే వారితో సంభాషించడానికి తగిన యోగ్యత తప్పకుండా వస్తుంది. ఇంతకంటే మన కీచదువుతో పనేముంది? హాయిగా రెండుపూటలూ కడుపు నిల్లబడుతూవుంటే ఎవడైనా వీపేరైనా ఎత్తేవాడేనా? దానికోసమే కామూ ఈ అగచాట్లన్నీ ఇక గాల్లో ఎగరాలనే గొప్పగొప్ప ఆకాంక్షలు మన కెప్పుడూ కలగ కలగవు. ఆలాటిగొంతెమ్మకోర్కెలను మనస్సుల్లో పెట్టుకోడం వాళ్లకి ఆరో మహాపాతకం. సరే పరీక్షలమాట ఉండనీ- ఇది కా మానవు, మనం ఇవ్వాళ మానం_మీరు నన్ను చూడగానే 'నీ కక్క సమాచారం తెలిసిందా ఏమిటి?' అని అడిగారు. సమాచార మేమిటి రాణీదగ్గర ఏవైనా విశేషాలు జరిగాయా?"

"విశేషాలున్నాయని కాదు మాఅభిప్రాయం. లేవని—అసంగతే నీకు తెలిసిరా లేదా అన్నాము. ఇదివరకు పరీక్షలరోజులు వచ్చాయా అంటే శైలువంతెన దగ్గరి కట్టమీద ఎక్కడజూచినా విద్యార్థులే ఉండేవారు. అంతేగాకుండా వూళ్లో అమ్మమ్మతుబోని నచ్చురకం పండ్లనీ, పాతమిఠాయీలనీ విద్యార్థుల కంటగట్టి డబ్బు పోగుచేసుకొందామని పండ్లవాళ్లు, మిఠాయిఅమ్మేవాళ్లు వచ్చేవాళ్లు. వీళ్లందరితో గలసి ఆస్థలమంతా మనుష్యులతో కిటకిటలాడుతూ వుండేది. ఇవ్వాళేముంది? మాలాగే దారితప్పివచ్చిన నలుగురైదుగురు విద్యార్థులు దప్ప ఇంకెవ్వరూ లేరు—కట్టంతా బావురుమంటూ ఉంది. మాకుగూడా ఎలాగో అనిపించి తిరిగి వద్దామనుకొన్నాంగాని ఎండచేత రావడానికి బద్ధకించాం. ఇక ఇంతదూరం రానే వచ్చాంగదా అని అక్కడే కూర్చొని కాయితాలు తిరగేసివచ్చాం. కాని ఇవ్వాళంతా వెళ్లేదన్నమాటే—నీసంగతేమిటి—గుళ్లో బాగా చదువు సాగిందా? అక్కడేమీ విశేషాలు లేవు గామా?"

"గుళ్లో ఏం విశేషాలూ? లాహోరుసిటీలో జరుగుతున్నాయి విశేషాలన్నీ. అందుమూలాన్నే కావచ్చు రావీ దగ్గర జనసామాన్యం గావడం—ఒకగంటైంది. సయ్యద్ మిట్ఠాబజారునుంచి అయిదారుమంది గృహస్థులు స్నానం చెయ్యడానికని వచ్చారు. వాళ్లు బావాజీతో చెప్పుతూ ఉంటే విన్నాను—మూడునాలుగుగంటలప్పుడు డబ్బీబజారులో సిక్కులకీ ముసల్మానులకూ గొప్ప పోట్లాటైందట. నిముషంలో ఇటువేపు యాభైమంది సిక్కులు, అటువేపు అరవైమంది తురకలు పోగయ్యారు—క్షణంలో అంగళ్లన్నీ మూసేశారు. ఇంతలోకే ఎవళ్లో టెలిఫోన్ చేశారు. చేతులుచేతులు కలియడం మొదలైందట. కాని నాలుగైదు నిముషాల్లోనే పోలీసుకమీషనరు, సూపరింటు, డిప్యూటీకమీషనరు, మేజిస్ట్రేటు, పోలీసుజవాన్లు గుర్రాలమీద పరుగెత్తుకొని వచ్చి మూకలను ఇవతలా అవతలా తోలేశారట. ఇప్పుడాబజారులో ఎక్కువమంది పోలీసువాళ్లని కాపలా ఉంచారనిన్నీ, అసలుగూడాని అందరూ పారిపోయినప్పటికి రెండుపక్షాలవారు ఉద్రేకంతో ఉన్నారనిన్నీ, సమయందొరికితే మళ్లీ ఓమాటు ఘోరాయించడానికి తయ్యారుగా ఉన్నారనిన్నీ చెప్పారు."

"ఆపోట్లాట కలగడానికి కారణ మేమిటట?"

"కారణమేమిటి? వీటిని పోట్లాట లనడంగూడా తప్పే. ఇవన్నీ ఒకవిధమైన తమాషాలు. ఇవ్వాళ పొద్దుని పదిగంటలప్పుడు మనం పేపరు ఇచ్చి యూనివర్సిటీహాల్లోనుంచి బయటికి రావడంతోటే మాల్ రోడ్డుమీద మ్యూజియానికి ఎదురుగుండా కోతులవాడు కోతులను ఆడించి చూడడానికి చుట్టూమూగిన వాళ్ల దగ్గర డబ్బు పోగుజేశాడు చూశారు గాదూ?" వాడిచేతిలో పేంబెత్తముంది. ఆబెత్తం సైగను బట్టి కోతులు తమాషాచేస్తూ వచ్చాయి. వాడాబెత్తాన్ని కుడిప్రక్కకు త్రిప్పేటప్పటికి కోతులన్నీ రెండుకాళ్లమీద నిలచి పరస్పరం చేతులను పట్టుకొని మహాఠీవిగా కులుక్కుంటూ నడవడం మొదలెట్టాయి—బెత్తాన్ని వాడు ఎడమవైపు త్రిప్పేసరికి పార్టీలుపార్టీలుగా ఏర్పడి గుర్రుగుర్రు మనుకొంటూ మహాభీకరంగా పోట్లాడడం మొదలెట్టాయి. అప్పటి వాటిమొగాలమీది ఉద్రేకం, ఉత్తేజం, వాటిపోట్లాటా చూస్తే ఇవన్నీ పరస్పరం కరుచుకొని రక్కుకొని చస్తాయేమో అని భయం కలిగింది. ఇంతలోనే వాడు బెత్తాన్ని కిందకొట్టాడు. చప్పున కోతులు పోట్లాడడం మానేసి మొగాలెత్తుకొని ఆకాశంకేసి చూస్తూ కండ్లను మిటమిట లాడించాయి—తరువాత బెత్తాన్ని పైకెత్తితే అవన్నీ నేలకేసి మొగాలు త్రిప్పుకొన్నాయి. ఆంపట వాడాబెత్తాన్ని పలయాకారంగా విసరేటప్పటికి అవి రెండుకాళ్లమీద నిలచి రెండుచేతులతో చుట్టూ పోగై ఉన్నవాళ్లందరికీ సలాములుచేశాయి. ఇవిచేసే తమాషాలవల్ల మనకందరికి చాలా ఆనందం కలిగింది. ఆడించేవాడికి బాగా డబ్బులు దొరికాయి. ఆకోతులపోట్లాటను పోట్లాట అంటారా? తమాషా—ఆలాగే యీమనపోట్లాటలు. వీటికారణాలూ వాటికారణాలంటివే. తక్కిన ఏకార్యాలకైనా కారణాలుండితీరాలిగాని యీ మనవివాదాలు కారణం లేకుండానే అవుతూవుంటాయి. ఒకవేళ దేన్నైనా కల్పించినప్పటికి అది అందులకు కారణమై ఉండదు. నాకు తోచినంతలో వీటికి అసలు కారణ మేదైనప్పటికీ గౌణకారణం మాత్రం మనరెండుపక్షాలవారి హాసం, దురాగ్రహం. అంతేకాక ఈకలహాల్లో హిందువులుగాని, మహమ్మదీయులుగాని పెద్దమనుషులైన వాళ్లెవరూ చేయిచేసుకొన్నలాగు కనబడదు. అనామకులైన నీచులు, పోకిరీలు, మోసగాళ్లు, గుండాలు తన్నుకొని కల్లోలంజేయడం. జగడమంతా అయినతర్వాత సమతమ జాతివాళ్లని పక్షపాతం కలుగజేసికొని పెద్దమనుషులైనవాళ్లు రంగంలోకి దిగడం, సభలుచేయడం, లెక్చర్లు కొట్టడం, డబ్బువసూలుచేయడం, ఖర్చుచేయడం: అన్ని బులపాటాలూ తీరినతర్వాత మళ్లీ యథాపూర్వం శాంతించడం—మానగరపువంతుకూడా అయిందిగదా అని సంతోషించడం."

"ఏమిటో! ఈవెధవ కొట్లాటలన్నీ నీ—మనయింటికి మనమే నిప్పంటించుకోవడం—తెలిసికూడాను."

"జరిగినంతకాలం జరగాలి—ఆపడానికి చేసే మనవాళ్లప్రయత్నాలన్నీ వ్యర్థమే అవుతూవున్నాయి. ఇంతకూ దేనికైనా సమయం రావాలి."

ఈలాగు మాట్లాడుకొంటూ సిటీని జుట్టుకొనిఉన్న గోల్ బాగు అనే తోటలో ప్రవేశించారు. క్రమంగా కాశ్మీరద్వారము, భాటీద్వారము, మోరీద్వారము, హాకీద్వారములు గడచిపోయినాయి. లోహారీద్వారము దాటి కొంచెము దూరం వెళ్లేసరికి శీతలామందిరంలోనుంచి జాగంటలచప్పుళ్లు వినవచ్చాయి. వీళ్లుముగ్గురూ ఒక్కక్షణంలో పరుగెత్తి మందిరద్వారంలో చేరారు. అమ్మవారి హారతిసమయం. విద్యార్థులప్పుడక్కడ తప్పకుండా ఉండి తీరాలి.

౩

ఉత్తరహిందూస్థానంలో మందిరమంటే దేవాలయం. లాహోరులోని శీతలామందిరం అమ్మవారిగుడి. అక్కడివాళ్లంతా ఆదేవిని దుర్గఅని పిలుస్తారు. ఇప్పుడీ గుడినిగురించీ, నాలుగువైపులా దీని నానుకొని ఉన్న లాహోరు భాగమునుగురించీ కొంచెం వివరంగా రాస్తాను. లేకపోతే మూడో ప్రకరణంలో రాయబోయే సంగతులు తెలియవు. ప్రస్తుతం సిటీఅని పిలవబడే రంజిత్ సింగునాటి పురాతనలాహోరు పట్నానికి దక్షిణంగా ఉంది ఈగుడి. ఆకాలంలో దీనికి పేరూ లేకుండా ఉండేదట. ఒకసన్యాసి అందులో ఉంటూ ఉండేవాడు. దీనికి తూర్పుప్రక్కని శాల్మీదరవాజా అని, పడమటవైపున లాహోరీదర్వాజా అని పట్నంలోకి పోవడానికి రెండుద్వారాలున్నాయి. ఈ లాహోరీ దరవాజానుంచి గుడికి పడమటగా తిన్నగా ఒక్కమైలు దక్షిణం పోయినామంటే పురానా అనార్కలీబజారు వస్తుంది. ఇతిహాసప్రసిద్ధమైన అసలు అనార్కలీబజారు ఇదే. పూర్వం ఈమందిరానికి చుట్టుప్రక్కల దూరదూరంగా తోటలు, తోపులు పొలాలు ఉండేవి. వాటి తరువాత అంతా అడవులమయమే. గుడిని ఆనుకొని శ్మశానాలు, గోరీలు ఉండేవని చెప్పుకొంటారు. అందుకు తార్కాణంగా యిప్పుడు ఈమందిరం వెనకాలగా ఉన్నతోటలో దున్నితే ఎముకలు, పుర్రెచిప్పలు, బయటపడుతూవుంటాయి. మన్నంతా బూడిదలాగ ఉంటుంది. కాని యిప్పుడీమందిరంపెద్ద బొస్తుగా మారిపోయింది. ఇప్పుడు దీనితో సామాన్యపు రాజవాడలు సరితూగలేవు ఇంతటి ప్రసిద్ధమైన మందిరం, ఇంతటి ఆదాయముగలదీ లాహోరులో ఇంకొకటి లేదు. ఇప్పుడు దీనికి సంవత్సరానికి నికరాదాయం లక్షముప్ఫైవేలకంటే ఎక్కువగా ఉంటుంది. ఇంగ్లీషువారు పంజాబును లోబరుచుకొని రైల్వేస్టేషను వేసి పెద్దదుర్గంలాటి స్టేషన్ కట్టించారు. దాంతో లాహోరుదశతోపాటు ఈమందిరందశకూడా తిరిగిపోయింది. దీనికి నాలుగువేపులా ఉన్నతోటలూ, తోపులూ అరణ్యాలూ సుందరవిశాల భవనాలక్రింద మారిపోయినాయి. ఉత్తరాన్ని సిటీ ఉండనేఉంది. తక్కిన మూడువైపులాకూడా నాలుగైదుమైళ్ల దూరానికి మించిన పట్నం పెరిగింది, ఇంకా పెరుగుతూఉంది. పాతఅనార్కలీ బజారును ఇప్పుడెవ్వరూ తలచుకోనే తలచుకోరు. ఈ మందిరానికి ఫర్లాంగుదూరంలో పడమటగా వెలసిన అనార్కలీబజారే ప్రస్తుతం లాహోరు నగరానికంతా అలంకారభూతం. ఈ పురాతన నూతన అనార్కలీలు కలిసినచోటినుంచి అడ్డంగా తూర్పునుంచి పడమటికి మాల్ రోడ్డు వ్యాపించి ఉంది. ఇది రావీనదిమీదుగా వచ్చే పెషావరు ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ రోడునుంచి చీలి పట్నంమధ్యగుండా షుమారు తొమ్మిదిమైళ్లు ప్రయాణంచేస్తూ లాహోరు కంటోన్మెంటుకు పోయింది. ఈరోడ్డుకూడా చాలా సుందరమైనదే. మనోహరవస్త్రాలంకార విభూషిత యగు హిందూవనువు అనార్కలీ; పాశ్చాత్య వధువు మాల్ రోడ్డూ. ఈరెండూ కలిసినచోట పూర్వపాశ్చాత్యసంకరం. లాహోరులోని ముఖ్యసార్వజనికభవనాలన్నీ ఈరోడ్డుమీదే వున్నాయి. రావీనదిదగ్గరనుంచి బయల్దేరామంటే క్రమంగా పోస్టు ఆఫీసు బిల్డింగులు, చిన్నరావీవంతెన, మేయో హాస్పిటల్ భవనాలు, బాదుషాహుసీదు, గురుద్వారాభవనాలు, ఇస్లామియా హైస్కూలు, లా బిల్డింగులు, సెంట్రల్ ట్రెయినింగ్ కాలేజిసౌధాలు, గవర్నమెంటుకాలేజి, కంపెనీపార్కు, యూనివర్సిటీభవనాలు, మ్యూజియం, జనరల్ పోస్టాఫీసు, హైకోర్టుబిల్డింగులు, లారెన్సుగార్డన్సు, జూ, గవర్నమెంటుహౌస్, గవర్నర్ బంగళాలు, కింగ్ కాలేజి బంగళాలూ ఇవన్నీ పది పన్నెండు మైళ్ళదూరం వరకూ వ్యాపించి ఉన్నాయి. ఇవి గాక వీని మధ్య మధ్య గొప్పయూరోపియన్ భవనములూ, బాంకులూ, హిందువుల వర్తక వ్యాపార స్థానాలూ ఉన్నాయి. ఈలాగు పట్నం మితిమీరి అభివృద్ధి పొందడంచేత ఇప్పుడీగుడి లాహోరు యొక్క హృదయస్థానాన్ని ఆక్రమించింది. ఇంతవరకున్న మహాంతులు గూడా దూరాలోనన గలిగి గుడికి చుట్టుప్రక్కలా ఫర్లాంగుల కొలదీ వ్యాపించి ఉన్న తమ నివేశనస్థలాల్లో దివ్యమైన భవనాలను కట్టించి పెట్టారు. అమ్మవారి గర్భగుడీ, దాన్ని ఆనుకొని ఉండే సౌధాలూ గాక దీనికి చెందిన మేడలు మిద్దెలు రెండుమూడుఫర్లాంగుల పర్యంతం వ్యాపించి వున్నాయి. సాలుకు వీటినుంచి అద్దెలమూలంగా అరవై డెబ్భైవేలు వస్తాయి. మందిరానికి ఎదురుగా అనార్కలీ నుంచి రైలుస్టేషనుకు పొయ్యే మెయిన్రోడ్డుంది. ఈరోడ్డుమీదుగా సమాంతరంలో సిటీకి దిగువగా గోల్ బాగ్ రోడ్డు ఉంది. ఈ గోల్ బాగ్ సిటీని ఆనుకొని తూర్పు దక్షిణ పడమటి పార్శ్వాల నాక్రమించి వలయాకారంగా ఉంటుంది. ఈ ఆకారాన్ని బట్టే దీనికి గోల్ బాగని పేరువచ్చింది. ఇది పూర్వం సిటీ చుట్టూ ఉండే అగడ్త. ఇంగ్లీషువాళ్లు ఈకందకాన్ని పూడ్పించి తోటకింద మార్చి మధ్యగుండా కేవలం మనుష్యులు నడవడానికి రోడ్డు వేయించారు. ఈరోడ్డు రెండువేపులా ఫర్లాంగు ఫర్లాంగు దూరంలో సన్నని కాలిబాటలను వేయించి తోటనంతా ప్లాట్లుగా విభాగం చేశారు. ఈ తోటంతటా ఎప్పుడూ గజం వెడల్పు నీళ్ల కాల్వ పారుతూ ఉంటుంది. ఈకాలవ నీటిని ఒక్కొక్కరోజు ఒక్కొక్క ప్లాటులోకి వదుల్తూవుంటారు. ఇందువలన ప్లాట్లన్నీ ఎప్పుడు చూసినా పచ్చని గడ్డితో నిండి మహా సుందరంగా ఉంటాయి. అప్పుడప్పుడీగడ్డిని మెషీన్తో కోస్తూ ఉంటారు. ఇవిగాక అనేకరకముల పూలచెట్లూ, తీగెలూ, ఫలవృక్షాలూ ఈతోటయొక్క అందాన్ని రెట్టింపు జేస్తూ ఉంటాయి.

సాయంకాలమప్పుడు, ముఖ్యంగా ఎండాకాలంలో, ఈ గోల్ బాగులోని పచ్చిక బయళ్లన్నీ మనుష్యులతో నిండిపోతాయి. కొన్నిచోట్ల రాజకీయ సభలు, కొన్నిచోట్ల సాంఘికసభలు, కొన్ని స్థలాల్లో సాధువుల ఉపన్యాసాలు, మరికొన్నిచోట్ల ఫకీర్ల సంభాషణాలు. పండితులు పురాణాలు చెబుతూవుంటే, శ్రోతలు వలయాకారంగా కూర్చొని వింటూ వుంటారు మరికొన్ని స్థలాల్లో. మరికొన్ని ప్రదేశాల్లో కళ్లులేని సిక్కుపాటకులు హార్మోనియం ముందు పెట్టు

కొని వాయిస్తూ శ్రావ్యంగా పాడుతూవుంటే వింటూ ఉంటారు అనేకమంది. బలిగుడు ఆడేవాళ్ల జట్టే లింకోవైపు. చంటి బిడ్డలని మెత్తని గడ్డిమీద ఆడుకోడానికి వదలి పెడితే వాళ్లు బోసగిలపడీ, మోకాళ్ల మీద నిలచీ గడ్డిపోచలిని గుప్పిడితో బట్టికొని లాగుతూవుంటే వాళ్ళని ఓరకంట చూస్తూ గుంపులు గుంపులుగ జేరి ముచ్చటలాడుతూ వుండే యువతులగు తల్లులు మరికొన్ని ప్రదేశాల్లో– ఈలాగు సాయంకాల మైదుగంటలయితే పిదప గోల్ బాగ్ ప్లాట్లన్నీ ఉత్సవాలతో నిండి కలకల్లాడుతూ వుంటాయి. * అమ్మవారి దర్శనానికి లోపలికి వెళ్లాలంటే మొదలు రెండు పెద్దద్వారాలని దాటాలి. ఇందులో మొదటిది ముఖద్వారం. ఈద్వారంమీద నొక మేడ–దానిమీద గోపురాలు–ముఖద్వారం తరువాత మరో విశాలమైన ద్వార ముంది. ఈ రెండుదర్వాజాల్లో దృఢమైన తలుపు లున్నాయి. రాత్రి ఏడు గంటలు కావడంతోటే ద్వారాలతల్పులను మూసివేసి వాటిమధ్య భాగంలో ఉండే కిటికీల్లాంటి చిన్నతల్పులని 9 గంటలవరకు తెరచి వుంచుతారు. ఆసమయంలో తీయకుండా పహరా వుంటుంది. ద్వారాన్ని దాటి లోపలికి పోవడంతోటే ఎదురుగుండా దేవీమందిరం. ఈదేవీమందిరం సంగమర్మరపు పలకలతో గట్టబడింది. గోడల్లో నాలుగైదుమూళ్ల అద్దాల్ని పొదిగి బిగించారు. అదిగాక గోడలమీదభాగంలో అనేకవిధాలచిత్రా లున్నాయి. ఈ దేవీమందిరం సరోవరంలోని కమలంలాగు మహాసుందరంగా ఉంటుంది. ఈమందిరానికి నాలుగువేపులా పదిపన్నెండు గజాలమేర ఖాళీప్రదేశం. అక్కడున నాపబండలను పరిచారు. మందిరానికి ఎడమవైపు రెండంతస్థుల గదులు చాలా ఉన్నాయి. వాట్లల్లో గుడియొక్క మహంతులవారూ, ఎప్పుడూ అక్కడే ఉండేసాధువులూ వుంటారు ఈగదులను ఆనుకొని పాకశాలలు కొఠార్లు ఉన్నాయి ఈభోజనశాలలో అతిథులు, అభ్యాగతులు, వైరాగులు, బ్రాహ్మణులు, భిక్షుకులు అంతా కలిసి నూటికంటె ఎక్కువమంది రోజూ రెండుపూటలా భోంచేస్తూ ఉంటారు. ఇందు కయ్యే ఖర్చంతా మందిరాదాయంనుంచే. దేవీమందిరానికి కుడివైపు శివాలయం; దానికి కుడిప్రక్కగా మరికొన్నిభవనా లున్నాయి. వీనిలో ఉత్తరంగా ఉన్నది చాలావిశాలమైన మూడంతస్తుల మేడ. నేలమీది గదుల్లో, రెండవయంతస్తులోని ముందరిభాగపుగదుల్లో విద్యార్థు లుంటారు. గదికి ముగ్గురు నలుగురుచొప్పున యాభై అరవైమంది సుఖంగా ఉండడానికి దగిన గదు లున్నాయి. వీట్లలో ఎప్పుడూ తగ్గకుండా యాభైమంది విద్యార్థు లుంటారు. వీళ్లీ మందిరములోని పాఠశాలలో సంస్కృతము జదువుకొని పంజాబు యూనివర్సిటీ పరీక్షలకు తయ్యారవుతూ ఉంటారు. కాని పరీక్షలు జరిగేదినాల్లో మరినలభై యాభై మంది విద్యార్థులు పంజాబులోని అన్యప్రాంతాలనుండి వస్తారు. ఈ పరీక్షలు పంజాబు యూనివర్సిటీకి సంబంధించినవి. ఓరియంటల్ ఫాకల్టీపరీక్షలనిగాని, ఓరియంటల్ టైటిల్సనిగాని వీటిపేరు. ఇవి అరబ్బీ, ఫార్సీ, సంస్కృతము, ఈభాషల్లో జరుగుతాయి. సాధారణంగా అరబ్బీ, ఫార్సీభాషలపరీక్షలకు మహమ్మదీయులు, సంస్కృతానికి హిందువులూ వస్తూవుంటారు. ప్రతిసంవత్సరం సంస్కృతం నిమిత్తం మూడునాలుగు వందల మంది విద్యార్థులు నానాప్రాంతాలనుండి వస్తారు. ఈ వచ్చినవాళ్లలో ఎక్కువమంది రైలుస్టేషనుదగ్గర ఉన్న మూల్‌చందు మందిరంలో దిగుతారు. తక్కినవాళ్లు శీతలామందిరంలో. ఈ రెండుచోట్లా దిగేవాళ్లకు ఒక్కవారం పర్యంతం ఉచితంగా ఉండడానికి స్థలం, రెండుపూటలా భోజనం దొరుకుతుంది. ఈఏర్పాట్లనుబట్టే శీతలామందిరంలోగూడా కొత్తవాళ్లు చాలామంది దిగారు.

ఇంతటితో ఇప్పుడు వీళ్ల సంగతి వదలి మళ్లీ రాస్తాను. రెండవయంతస్థులోని గదులకు వెనుకభాగాన్ని విశాలమైన శాల లున్నాయి. వాట్లల్లో పండితులు విద్యార్థులకు పాఠాలు చెబుతారు. ఈ మేడయొక్క మూడోఅంతస్థుమీద ఒక్క కాపురానికి సరిపడ గృహ ముంది. అందులో ముఖ్యాధ్యాపకు లుంటారు. అధ్యాపకులకూ, విద్యార్థులకూ మరో భోజనశాల ఉంది. దీనిఖర్చంతా మందిరాదాయంనుంచే. శివాలయానికి తూర్పు దక్షిణ పార్శ్వాల్ని మరికొన్ని మేడ లున్నాయి. వాటిలో అభ్యాగతులైన సాధువులూ, దేవీదర్శనం నిమిత్తం వచ్చి కొన్నాళ్లపాటు ఉండే గృహస్థులూ దిగుతూ ఉంటారు.

ఇక ఈదేవీదర్శనానికి ఒక్క హిందువులే కాదు, సమస్తవర్ణాలవారు వస్తారు. విగ్రహారాధనం వేదవిరుద్ధం, దాన్ని చేయడం మహాపాపం అని చెప్పే ఆర్యసమాజకుల యువతులు, ఏకేశ్వరోపాసనం మనం చేయదగింది, ఈబొమ్మలపూజలన్నీ అనాగరికులవని బోధించే బ్రహ్మసమాజకుల భార్యలు, దేవునిదప్ప మరొకర్నిపూజించడం దోషమని వాదించే దేవసమాజకుల స్త్రీలు, హిందూదేవాలయాల్లోకి పోవడానికి సమ్మతించని జైనులకాంతలు, సంఘసంస్కర్తల ధర్మపత్నులు తమతమభర్తల కార్యాంతరాలనిమిత్తం ఇల్లు వదలిపోవడంతోటే బిడ్డలని చంకబెట్టుకొనివచ్చి అమ్మవారిని దర్శించి వారితీర్థప్రసాదాలను దీసికొని పోతూ వుంటారు. లేకపోతే యేవేళ అమ్మవారు పోసి చంద్రబింబంలాంటి తమబిడ్డలు కురూపులైపోతారో అని భయం. భయంచేతనే భక్తి ఎక్కువ. ముసల్మాన్ స్త్రీలుకూడా దేవిని దూరాన్నుంచి దర్శించి పాదతీర్థం మొగాలని కొట్టించుకొనిపోతారు. వీరికి గర్భగుడ్లోకి పోవడానికి వీలులేదు. గర్భగుడివెలుపల వీరినిమిత్తం ఒక కిటికీ ఏర్పాటై ఉంది. అక్కడికి వచ్చి ముసల్మాన్ యువతులు బిడ్డల నెత్తుకొని నిలుచుంటే పూజారి అమ్మవారి పాదోదకం తీసికొనివచ్చి వాళ్ల మొగాలమీద జల్లి వాళ్లిచ్చే ముడుపులను పోగుచేసికొని పోతూవుంటాడు. ఈ మందిరానికి పురుషులుకూడా వస్తూనే ఉంటారు. కాని స్త్రీలసంఖ్య అపరిమితము. మార్చి ఏప్రిల్ నెలల్లో గొప్ప ఉత్సవాలు జరుగుతాయి. ఆరోజులలో రావడానికీ పోవడానికీ సందుదొరకదు. ఈవుత్సవాలు మొదలైనవానివల్ల అనేకవేల రూపాయల ఆదాయం.

* ముఖ్యంగా శీతలామందిరానికి ఎదురుగుండా ఉండేభాగంలో రోజూ తిరణాల్లాగే వుంటుంది.

జేగంటలూ గంటలమోతలూ చెవిలో బడడంతోటే మన విద్యార్థులు ముగ్గురూ ఒక్కపరుగులో ముఖద్వారం చేరారు. అప్పటికే నగంహారతి కావస్తోంది. దాన్నిగనిపెట్టి వీళ్లు మళ్లీ క్షణంలో తమగదులకాడికి బరుగెత్తి పుస్తకాల్ని కిటికీల్లోనుంచే లోపలికి గిరాటు పెట్టి వచ్చి హారతిలో కలుసుకొన్నారు. ఇంతలో హారతి సమాప్తమైంది. వెంటనే ఇంతలా అంతలా ఉన్న విద్యార్థులందరూ అమ్మవారి యెదట రెండుపంక్తులుగా నిలబడి ముదలు దేవ్యపరాధస్తోత్ర శ్లోకాలను పఠించారు. అందరూ ఒకేస్వరంలో ఎలుగెత్తి పఠిస్తూవుంటే వినేవాళ్లకి మహా ఆనందం కలుగుతుంది. ఆస్తోత్రాలను బూర్తిజేసి గర్భగుళ్లోనుంచి బయటికి వచ్చి ఎవరికి నోటకివచ్చిన శ్లోకాలను వాళ్లు పఠించుకొంటూ ప్రదక్షిణాలు చేశారు. అది కావడంతోటే దేవికి ప్రణామాలుచేసి శివాలయం ఎదటికి వచ్చి పూర్వంలాగే బార్లుదీరి నిల్చొని అందరూ వినాయకస్తోత్రాలు, శివస్తోత్రాలు పఠించారు. ఇది ముగియగానే మహాదేవునికి వందనాలు చేసి వీళ్లు మహాంతులవారి దగ్గరకు బరుగెత్తిపోయి వారిపాదాలకు నమస్కారంజేసి, అంతకు బూర్వమే యక్కడజేరి మహాంతుగారి ప్రక్కని కుర్చీలమీద కూరుచున్న అధ్యాపకులకు దండంపెట్టి వారియెదుట నేలమీద కూర్చున్నారు. దర్శనానికివచ్చిన గృహస్థులు మరోప్రక్కను కూర్చున్నారు. ఏదో సంభాషణ అవుతూఉంది. మహాంతుగారు ఖులాసామనిషి; మంచి ఉదారబుద్ధి కలవారు. ఎల్లప్పుడు ప్రసన్నవదనంతో ఉంటారు. వీరి అన్నక్షేత్రంలో రోజూ భోంచేసేవాళ్లు సుమారు వందలమందికి తక్కువగారు. దగ్గర ఉన్నవాళ్లు కొందరు ఇంతఖర్చు ఎందుకని ఏమిస్తూ ఉంటారు. కాని వీరు వాళ్లమాటల్ని లక్ష్యమేచెయ్యరు. విద్యార్థులమీద చాలాప్రేమ. ఖులాసా పుట్టిందంటే నూరు నూటయాభై రూపాయలు ఖరీదుచేసే పండ్లబుట్టలు ఒక్కనిమిషంలో వచ్చిపడతాయి చూస్తూ చూస్తూవుండగానే విద్యార్థులు తోట్లాతొక్కలూ మింగేస్తారు. ఒక్కొక్కసమయంలో క్షీరాన్నాలు, నానాభోగాలూ ఎదురవుతూ వుంటాయి. కాని వీరిది మహానిర్లక్ష్యస్వభావం. తనమీద కేదైనా విపత్తు వస్తుందని తెలిసినప్పటికీ వచ్చినతర్వాత తంటాలు పడవచ్చు. కాని ముందుగానే తప్పించుకోడానికి ప్రయత్నంజేసే స్వభావంకాదు. గృహస్థులు వీరితో మాట్లాడుతూ ఉన్నది డిబ్బీబజారు విషయము. వీళ్లేదో సలహా ఇస్తూవుంటే మహాంతుగారు దానిని పాటించడంలేదు. వీరు నిర్లక్ష్యంగా నవ్వుతూ "ఇలాంటి విదవర కెన్నో జరిగాయి-కొత్తగాదు. ఇప్పుడంతగా మనతలమీది కేం వచ్చింది?" అన్నారు.

"నిజమే కానిండి-వాటికీ వీటికీ చాలా తేడాఉంది. మేంగూడా అన్నీ చూస్తున్నాం కాదూ. కాని ఇవ్వాళ సాయంకాలం వైఖరి చూస్తే ఏదో గొప్పఉపద్రవం అయ్యేలాగే కనిపిస్తోంది. ఏలాగైనా మన ప్రయత్నంలో మనం ఉండడం మంచిది. మనం కలహానికి దిగకపోయినప్పటికీ ఒకవేళ మనమీది కేదైనా వస్తే తప్పించుకోనైనా వద్దా?"

"ఎవళ్లో సిక్కులూ తురకలూ పోట్లాడుకుంటే మనకు వచ్చిన భయమేమిటి? మనకూ తురకలకీ ఏమైనా విరోధం ఉందా-మీరన్నలాగు జరుగుతుం దనుకోడానికి? ఎంతమంది తురకాళ్లు వస్తూఉంటారో చూశారా మనదేవికి మొక్కడానికి?"

"మీరాలాగు సెలవిస్తే మే మేం జెప్పాలి? వీళ్లమీద మీకింతటి నమ్మకం ఏలా కలిగిందో తెలియడంలేదు. వీళ్లు సిక్కులనీ మనల్నీ వేరువేరుగా చూస్తారా? కాఫర్లంతా ఒకటే వీరిదృష్టికి. తప్పెవళ్లదైనా, ద్వేషం ఎవళ్లతో ఉన్నా దాన్నంతా ఆలోచించరు-ఎవళ్లు చిక్కితే వాళ్లమీదే చూపిస్తారు తమ శౌర్యాన్ని. ఇంతవరకెన్ని పోట్లాటలో అయ్యాయి-వాటినిగురించి మన మేం వింటున్నాం? కలహాలు తగ్గిపోయింతరువాతగూడా ఎవడైనా గ్రహచారంచాలక ఒంటరిగా దొరికాడంటే వాడిభరతం పట్టిస్తున్నారు."

"అయితే ఇప్పుడు మీసలహా ఏమిటి? ఏం చెయ్యమంటారు చెప్పండి."

"చేసే దేముంది? ముందుగానే ఠాణాలో రిపోర్టుచేసి ఇరవై ముప్పైమంది పోలీసువాళ్లను పిలిపించి రేపుపగలంతా మందిరంలోపల బయటా కాపలా పెట్టించండి. సాయంకాలందాకా ఉండి వెళ్లిపోతారు. ఇందులో మనకు వచ్చే నష్టమేమిటి?

బిగ్గరగా నవ్వుతూ.. "ఏం పిరికిపందల్లే బయల్దేరారు-మహావ్యా- ఇలాంటింటాంటి అర్థసంతానాలస్తే గ్యమంటే- ఎప్పుడో! ఏమో వస్తుందని ముందుగానే వెళ్లి ఠాణాకెళ్లకోవాలి! నామాటగూడా కొంచెం వినండి. మనదుర్గ అనుగ్రహం ఉన్నంతవరకూ మన కేం భయం లేదు. నాకు బాగానమ్మకం-మీరుమాత్రం నిశ్చింతగా ఉండండి. చూద్దాం, మనమందిరాని కేం ముప్పు వస్తుందో."

గృహస్థులకిక మాట్లాడడాని కేమీ తోచిందికాదు. మహాంతుగారి పట్టుదలనాక్యాలవల్ల వీళ్లకోమాదిరి సంతోషంగూడా కలిగింది. ఇంతలో విద్యార్థుల భోజనానికి గంట వినవచ్చింది. ఒక్కక్షణంలో వాళ్లా స్థలాన్ని ఖాళీచేసి తిన్నగా భోజనశాలలో చేరారు. తరువాత గృహస్థులుకూడా మహాంతుగారికి ప్రణామాలుపెట్టి వారిసెలవు తీసికొని ఎవళ్లదోవని వాళ్లు వెళ్లారు.

క్రమక్రమంగా తొమ్మిది పది పదకొండు గంట లైంది. నగరమంతా క్రైస్తవుల అంధకారపు నల్లటిపాపు క్రింద నూరుతూ ఉంది. అనార్కలీ బాజారులో, వీధీవీథుల్లో మిఠాయి దుకాణాలు, తమలపాకు బీడాల దుకాణాలు మాత్రం తెరచి వున్నాయి. కాని వాటిదగ్గర అంత అలజడి ఏమీ లేదు. అప్పుడప్పుడు రసికశిఖామణు లెవ్వరో వచ్చి మిఠాయీలనీ, బీడాలనీ, కొనుక్కొని పోతూవున్నారు. అత్యంత ప్రకాశమానము లైన ఎలెక్ట్రిక్ దీపకాంతులు ఉపరిభాగాన్ని ప్రసరిస్తూ వున్నందు వలన మా నేవాళ్లకి నగరాధిదేవతయొక్క శిరోభాగమున జాజ్వల్యమానముగ వెలుంగు తదీయచ్ఛాయామండలమా అని

పిస్తూ ఉంది. ఇద్దరిద్దరు లేక ముగ్గురూ కలసి పోలీసువాళ్లు డ్యూటీని నిర్వర్తిస్తూ ఉన్నారు. వీళ్ల కుడిచేతుల్లో పొడుగుపాటి దృఢమైన లాఠీ కర్రలు, ఎడమ భుజాలమీద కంబళ్లు ఉన్నాయి

శీతలామందిరమంతా విద్యుద్దీపాలతో వెలిగిపోతూ ఉంది. మహంతుగారి నిశ్చింతస్వభావము అందరికీ తెలిసిందే. సమస్తమూ పరిత్యాగముచేసిన వీరివంటి వారికి ఈ అనిత్యసంసారపు గొడవలతో పనేముంది? వేళ కింతవల్ల కడుపులో బడితే చాలు. ఇక లోకమంతా అటు ఇటైనా వీరి కేమీ చింతవుండదు. పదకొండు గంటలకు కొంచెం పూర్వమే వీరు శయనమందిర మాక్రమించారు ఇప్పుడు నిద్రాదేవి ఉపగూహనాల్లో వీరికి దేహస్మృతే లేదు. ముఖద్వారాల దగ్గర వున్న పహారావాళ్లు డయిటేన్ హ్రికేనులాంతర్లని వెనుక బెట్టుకొని కునికిపాట్లు పడుతూ కూర్చొన్నారు. వీళ్లకు నిద్ర ఎక్కువ అవుతూ ఉన్నట్లు గన్పిస్తుంది. వీళ్లు నేలమీద కూర్చున్నారు. తలలు మెల్లగా వంగుతూ వంగుతూవచ్చి టక్కున నేలమీద తగిలేటప్పటికి చప్పున మళ్లీ కళ్లు తెరచి తలలు పైకెత్తుతూ వున్నారు. తక్కిన నౌకర్లుగూడా పగలంతా పనిపాటలు చేసి వున్నవాళ్లు కావడం చేత పక్కలమీద వాలంగానే అప్రయత్నంగా తెలియకుండానే మైకంకమ్మింది. కళ్లు మూతలు బడిపోయినాయి. కాని పరీక్షావిద్యార్థులు మాత్రం ఇంకా మేలుకొనే ఉన్నారు. తెల్లవారితే మూడో పేపరు. అందునిమిత్తం వచ్చేనిద్రను నాల కష్టంమీద అదుముకొంటూ పుస్తకాలను తిరగేస్తూ ఉన్నారు. పన్నెండైంది. ఒంటిగంటకూడా కావచ్చింది. పట్నమంతా పూర్తిగా మాటు మడిగి పోయింది. నాల్గు వేపులా నిశ్శబ్దరాజ్యం. అలాంటి నితాంత నీరవమైన సమయంలో ఉన్నట్టులుండి హఠాత్తుగా హైరోడ్డుమీద గుర్రమొకటి వాయువేగంతో పరుగెత్తినలాగు ధ్వని వచ్చింది. మేలుకొని ఉన్నవిద్యార్థులు అర్ధరాత్రివేళ అలా పరిగెత్తడ మేమిటా అని ఆలోచిస్తూ ఉండగానే మరికొన్ని గుర్రాలు రయ్యిమని పరిగెత్తాయి. వెంటనే లేచి వీళ్లు పాఠశాలలో ఉన్న కిటికీల దగ్గరకు పరుగెత్తుకొని పోయి చూసేసరికి రిజర్వుపోలీసు సోల్జర్లతో నిండి వున్న రెండుమూడు మోటారు బస్సులు గాండ్రిస్తూ పరుగెత్తాయి. కొంచెం పైగా ఉన్న గోల్ బాగ్ రోడ్డుమీదుగా పదిహేను ఇరవై మంది పోలీసువాళ్లు అమితవేగంగా పరిగెత్తారు. వీళ్లంతా చూస్తూ చూస్తూ ఉండగానే శాల్మి దర్వాజా గుండా సిటీలో ప్రవేశించి అంతర్ధానమైనారు. ఏకారణంచేత ఎక్కడికి వెళ్లారో తెలియదు. అప్పుడు బయటికి పోవడానికా వీలులేదు. ద్వారాలన్నీ తాళాలతో వున్నాయి. కాని సిటీలో ఎక్కడనో బాగా గందరగోళమై వుంటుందని ఊహించుకొని గదుల్లోకి తిరిగి వచ్చి పక్కలమీద శరీరాలను వాల్చారు. కండ్లుమూసుక పోయాయి. ఈపరీక్షలకని వీళ్ల కన్నాళ్ల నుంచో కంటినిండా నిద్రే లేదు. పాపం వొళ్లెరుగని నిద్ర వచ్చింది ఈక్షణంలో. తర్వాత ఏం జరిగిందీ వీరికీ తెలియదు. కాని సమస్త బ్రహ్మాండాన్ని నిద్ర ఆవేశించి నప్పటికీ మేలుకొని ఉండేది ఒక్క కాలమే. ఈ కాలపురుషుని గతివిన్యాసం మహావిచిత్రమైంది. దీనికి నిరోధమనేది లేనేలేదు. ఈ పురుషున కెప్పుడూ ముందుచూపేకాని వెనుకచూపు లేదు. లక్షలకొలది పుట్టినా గిట్టినా సరే; భూకంపాలుద్భవించి స్థలం జలంగా, జలం స్థలంగా మారిపోయినా సరే; జ్వాలాముఖీ పర్వతాలు పగిలి చుట్టూ ఉండే గ్రామాలూ నగరాలూ నామనష్టమై పోయినా సరే; మహాభయంకరసంగ్రామాలై రాజ్యాలకు రాజ్యాలు తల్లక్రిందులై పోయినాసరే; యీ మహాపురుషుని అడుగు ముందు పడుతూనే ఉంటుంది కాని ఆగదు. తృణకల్పులమైన మనకు ఉద్వేగం, ఆతంకం, విషాదం, మనోవ్యథా కలిగించి బుద్ధినికూడా చలింపజేసే భయానకఘటనాలన్నీ ఈ కాలవిశ్వరూపుని పాదాల కింద గడ్డిపరకల్లాగు ఊరుపేరు లేకుండా నలిగి పోతూ వుంటాయి. అట్టి యీ మహాకాలుని ముందు ఆరాత్రి లాహోరు బజారుల్లో జరిగిన సంగతులో లెక్కా? రాత్రి గతించిన వాట్లో లెక్కైంది. మేనెల మూడోతారీఖు ప్రవేశించింది. నగరమంతా యథాపూర్వం నానా వినధ్వానాలతో నిండిపోయింది. మైమరచి నిద్రించిన విద్యార్థులు గూడా లేచి తొందరతొందరగా నిత్యకృత్యాలూ, స్నానాలూ జేసికొని యూనివర్సిటీ హాలుకు బోవడానికి తయ్యారైనారు. హాలుకు పోయేముందు వీరందరికీ ఖుష్టే లస్సీ దొరకింది. ఖుష్టేలస్సీ అంటే పంచదారకలిపిన తియ్యని చిక్కనిమజ్జిగ. ఈ దేశంలో చలికాలమందు అపరిమితమైన చలిఅయినప్పటికీ ఎండాకాలంలో ప్రచండమైన వేడిమికూడా పెద్దల్నిజ్ఞాపకంచేయిస్తూ వుంటుంది. అందుచేత ముఖ్యంగా పంజాబీలూ, సింధీలూ వేసైనన్నిసార్లు సర్దాయీలు, ఖుష్టేలస్సీలు, మీఠీలస్సీలు, షర్బత్తులు ఎగబోస్తూ వుంటారు. ఎన్నిసార్లు తాగినా వద్దనిపించదు. దాహానికి తగినలాగు పొట్టనుకూడా ఎందుకియ్యలేదా అని దేవుడిమీద సహింగని కోపం వస్తుంది. మిష్టద్రవాల్ని కుతికల బంటిగా ఎక్కించినప్పటికీ దాహం తీరదు. నాలిక లాక్కొపోతూ ఉంటుంది. ఇంకా తాగాల్నే అనిపిస్తుంది. వీటన్నిటిలో ఖుష్టేలస్సీ ముఖ్యమైంది. దీన్ని తాగి ఏపనికైనా వెళ్లితే ఆపని తప్పకుండా నెరవేరుతుందని అక్కడివాళ్ల అభిప్రాయం. ఆకారణాన్ని పరీక్షలకు గాని, ప్రయాణాలకు గాని, మరి యేశుభకార్యాలకుగాని వెళ్లేముందు చిక్కని మజ్జిగలో పంచదార కలిపి తాగిస్తారు. మహంతుగారి అనుగ్రహంవల్ల విద్యార్థుల కందరికీ పుష్కలంగా దొరికింది లస్సీ. తాగి తేన్పుకొంటూ బయల్దేరారు పరీక్షాభవనానికి పోవడానికి. దారిలో వీళ్లకు అనార్కలీ తగులుతుంది. ఆబజారులో ప్రవేశించేటప్పటికి అక్కడున్న వాళ్లందరూ గుంపులు గుంపులుగా కూడి మాట్లాడు కొంటున్నారు. అందరిమొగాలూ విపరీతంగా మారిపోయి ఉన్నాయి. విచారిస్తే రాత్రి సిటీలోని డబ్బీబజారులో కొంత ఖూనీలు జరిగా యనిన్నీ, అందుచేత తురకలు హడతాలు చేస్తారనిన్నీ తెలిసింది. కాని పరీక్షకు వెళ్లాలనే తొందర మీద ఆవిషయాన్ని గురించి ఎక్కువగా మాట్లాడడానికి వీల్లేక వీళ్లు తిన్నగా యూనివర్సిటీకి బరిగెత్తి హాల్లో చేరుకొన్నారు. ప్రశ్నపత్రాలు

చేతి కందాయి. రాయడం మొదలెట్టారు కాని మనసుకి స్తిమితం కుదిరింది గాదు. ధ్యానం పరిపరివిధాల పోయింది. బజార్లో విన్నదాని మీద అభిలాష యెక్కువైంది. మనస్సును బిగబట్టుకొని రాస్తూ వుండేవాళ్లు; కాని తెలియకుండా దప్పున పరుగెత్తేది వీధిలోకి. ఈప్రకారం తికమకలౌతూ రాశారు. మూడుగంటలూ నిమిషంలాగు ఎగిరి పోయాయి. పదిగంట లధ్యాపకులకి పేపర్లను ఇచ్చి బయటికి వచ్చేటప్పటికి మాల్ రోడ్డంతా పోలీసుల మయంగా గాన్పించింది. సోల్జర్లూ, సిపాయీలూ గుర్రాలమీద పచారు చేస్తున్నారు. అనార్కలీలోకి వచ్చేటప్పటికి అక్కడా ఇదేదృశ్యం కన్పించింది. షాపులన్నీ వేసున్నాయి. సాధారణంగా ఏడుగంటలు కొట్టకపూర్వం ఎవరూ దుకాణాలను తెరవనే తెరవరు. కాబట్టి పొద్దున వెళ్లేటప్పుడు హడతాలు అవుతుందని కాని, కాదని కాని నిశ్చయించుకోడానికే వీలైంది కాదు. కాని, ఇప్పుడో, పది దాటింది. ఈపాటికి షాపులన్నీ తెరిచి వుండాలి సింది. అలాగు లేవు. తురకల షాపులన్నీ మూసివున్నాయి. తెరిస్తే తమవాటి నెక్కడ లూటీచేస్తారో అని హిందువులుకూడా దుకాణాల్ని కట్టిపెట్టారు. అనార్కలీ ఈచివరనుంచి ఆచివరవరకూ ఏడెనిమిది దుకాణాలు మాత్రం తెరచి వున్నాయి. ఇప్పుడు సంగతులన్నీ బాగా తెలిశాయి. గతించినరాత్రి పన్నెండు దాటిన తర్వాత డబ్బీబజారులో ఇద్దరు తురకాళ్లని సిక్కులెవరో నరికేశారట. అందుచేత మహమ్మదీయులంతా మండిపడి పోతున్నారు.

ఈ రోజుల్లో ఇంకోతమాషా జరుగుతూ వచ్చింది.

ఏ ప్రయివేటు కారణాలచేత ఖూనీలు జరిగినా వాటిని మతసంబంధమైన మరణాలుగానే భావించి చచ్చినవాళ్ళని ధర్మవీరులని ప్రకటనలు చేస్తూ వుండేవాళ్లు. ఈలాగు పూరా పేరూ లేనివాళ్లెందరో శహీదు లయ్యారు. శహీదు లంటే ధర్మంకొరకు ప్రాణం విడిచినవాళ్లు. అందుచేత ఇప్పుడు ఈ చచ్చినవాళ్లిద్దరూ శహీదులనిన్నీ, వాళ్లని పట్నమంతా ఊరేగించి దఫనంచెయ్యా లనిన్నీ పట్టుబట్టారు తురకలు. ఇదివరలో హిందువులు, ముఖ్యంగా ఆర్యసమాజంవాళ్లు ఈలాటి ధర్మవీరులను కొందరిని ఊరేగించి సహానంచేశారు, కాని ఆసమయంలో విశేషాలేమీ జరిగాయి కావు. ఇలాగే యివ్వాళకూడా అవుతుందని కాబోలు. అందుకనే ఈ అడావిడీఅంతా – అనుకొని విద్యార్థులు తమతమ నివాసాలకు జేరుకొన్నారు. మధ్యాహ్నం భోజనా లయ్యాయి. భోజనాలు కావడంతోటే మర్నాటి పరీక్షకు గావలసిన గ్రంథాలను జంకపెట్టుకొని ఏరావీతీరానికో, ఏతోటల్లోకో ఏయితరమందిరాలకో పోతూవుండేవారు. అక్కడ ఏకాంతంగా ఉండే ప్రదేశాల్లో కూర్చొని ఎండ చల్లబడేదాకా చదువుకొని తరువాత కుటీరాలకు జేరుకోడం అలవాటు. కానీ పట్నమంతా హడతాలని అడావిడిగా ఉన్నందువల్లా, తురకల ఊరేగింపు సమయాన్ని ఏంగందరగోళాలు జరుగుతాయో అని కొందరు బయటికి పోవడం మానేశారు. మరికొందరు ఊరేగింపు చూడాలనే అభిలాషతో వెలుపలికి పోలేదు. ఏలాగైతేనేం ఒకర్ని జూచి ఒకరు అందరూ బయటికి వెళ్లడం మాని ఆమందిరంలోనే యిటూఅటూ సర్దుకొన్నారు. గర్భగుడిచుట్టూ ఉన్న వసారాలో కొంతమంది, అక్కడికి వెనకభాగంలో ఉన్నతోట్లో కొందరూ చేరి చదువుకోడం మొదలెట్టారు. ముఖ్యాధ్యాపకులు మూడో అంతస్థుమీద కూర్చొని కొందరు విద్యార్థులను మర్నాటి పరీక్షకు తయ్యారుచేస్తూ ఉన్నారు. రెండవ మేస్టరు పాఠశాల్లోనే కూర్చొన్నారు. ఆయన విద్యార్థు లేవిషయాన్నైనా అడిగితే వాళ్లకు సమాధానం చెబుతున్నారు. అంతటా మహాశాంతంగా ఉంది. రెండు గంటలైంది. తురకల ఊరేగింపు వస్తుందని తెలిసింది మందిరంవాళ్ల కందరికీ. వెంటనే ఇక్కడా అక్కడా కూర్చొని చదువుకోడానికి పోయిన విద్యార్థులూ, మందిరంలోని నౌకర్లూ, దేవీదర్శనం నిమిత్తం బయటినుంచి వచ్చిన వాళ్లూ అందరూ ఊరేగింపు చూడడానికి ఎగబడ్డారు. మూడో అంతస్థుమీద నిల్చున్నవాళ్లకు శాల్మి లాహోరీదర్వాజాల పర్యంతం గోల్ బాగ్‌లో గాని హైకోర్టుమీదగాని ఏం జరిగినా బాగా కనబడుతుంది. అందువల్ల ఎక్కువమంది అక్కడే పోగయ్యారు. పాఠశాల్లోని కిటికీల దగ్గర సందు లేదు. ముఖద్వారం ఒకరెక్క వేసిఉంది. రెండో రెక్కను గూడా సగందాకా మూసి వుంచి మూడ్నాలుగైమంది తేనెటీగల్లాగ మూగి నిల్చున్నారు. ఇదేప్రకారం ఆరోడ్డుకు రెండువైపులా ఉన్న మేడలన్నీ మానేవాళ్లతో నిండిపోయ్యాయి. ఇంతలో శాల్మి దర్వాజా దాటి బయటికి వచ్చిన ఊరేగింపులోనుంచి "లాఇలాహి ఇల్లల్లాహ" అనే రచ్చకేకలు వినవచ్చాయి. అందరికంటే ముందు ఎర్రజెండాలసుష్టల సర్వనమైంది. వీరి వెంటే రెండుమూడువేలమంది తురకలూ, తరువాత శవాలూ, వీటివెనకవాల్లి మళ్లీ ఇరవైవేలమందిమహమ్మదీయులు. ఇంతలో ఈశవాలకి ముందూ వెనకా ఉన్న మూడు నాలుగవేలమంది తురకలూ ఒక్కధ్వనిగా "లాఇలాహి ఇల్లల్లాహ" అని అరుస్తున్నారు. మధ్యమధ్యనుండా పోలీసువాళ్లున్నారు. అందరూ తురకలే. క్రమక్రమంగా శవాలు మందిరంఎదటికి వచ్చాయి. ఇప్పుడు మందిరాన్ని కిటికీలూ అవతలా శాల్మిలాహోరీల మధ్యభాగమంతా మహమ్మదీయులే. అసలే వీళ్ల కేకలు ఆకాశాన్నంటుతూ ఉన్నాయి అప్పుడు లాఇలాహి తప్ప వేరేశబ్దం వినరాలేదు. మందిరముఖద్వారంలో ఉన్నవాళ్లంతా ప్రశ్నయుతై నోళ్లు తెరుచుకొని చూస్తున్నారు

మందిరం ఎదటికి రావడంతోటే వీళ్ల కేకలు పదిరెట్లెక్కువయ్యాయి. కేకలు ఎక్కువ కావడంతోపాటు అరిచేవాళ్లకు ఆవేశం పెరిగింది. మొగాలు ఎర్రబారాయి. చూస్తూచూస్తూ ఉండగా మెరుపు తళుక్కుమన్నంత వ్యవధానంలో ఈఆవేశమెక్కిన తురకల గుంపొకటి ముఖద్వారానికి పదిగజాలముందుగా రోడ్డుమీద ఉన్న సోడాలిమ్మొడ్ దుకాణంమీద పడింది. వెంటనే ముఖద్వారంలో పోగైఉన్న హిందువులందరూ ఒక్కపెట్టున లోనికి విరుచుకొపడ్డారు. మహంతుగారు ఉన్నది ఈగుంపులోనే. వీళ్లంతా రెండో

తక్కువ చూసి అతిప్రయాసంమీద గొళ్ళెం తగిలించారు. ఇంకా గొళ్ళెం తగిలించడం పూర్తిగానేలేదు. సోడాలిమ్నేడ్ సీసాలు వడగండ్లలాగు ద్వారంమీద పడడం మొదలెట్టాయి. ఒకమాదిరి తలుపులే అయితే క్షణంలో ఎగిరిపొయ్యేవి కాని లోహంలాటివి కాబట్టి బయటివారితో పులకూ, సీసాలప్రహారాలకూ తాళుకొన్నాయి. ఇంతలో సీసాలజడివాన మందిరంమీద అన్నిప్రక్కలా కురియడం మొదలైంది. నాలుగైదు నిమిషాల్లో లిమ్నేడ్ షాపు ఖాళీ. తరువాత చేతికందిన వానినెల్లా మందిరంమీద రువ్వడంమొదలెట్టారు తురకలు. బయట ఊరేగింపు నిలచిపోయింది. లాఇలాహీ కేకలు మరింత మిన్నుముట్టుతున్నాయి. ఇప్పుడు కేవలం ముఖద్వారంమీదే కాదు ఆక్రమణం. ఇటూఅటూఉండే మందిరానికి సంబంధించిన మేడలమీదకూడా మొదలైంది. ఇంక కొన్నినిమిషాల్లో ఏమౌతుందో తెలియదు. లోపలివాళ్లకు ఏంచెయ్యాలో పాలుపోకుండాఉంది. మహాంతులవారు మందిరమంతటా పరిగెత్తడం మొదలెట్టారు—పాపం వారి మొగ మిప్పుడు ఉత్కంఠాపూర్ణమైంది. వీరికే కాదు, లోపల ఉన్నవాళ్ల మొగాలన్నీ భయోద్రేకంతో నిండిపొయ్యాయి. మహాఆందోళనంగా నాలుగుమూలల పరుగెత్తుతున్నారు. క్రింది అంతస్తులో నేలమీద ఉన్నవాళ్లందరూ కింకర్తవ్యమూఢులై కంగారు పడుతున్నారు. ఇంతలో హఠాత్తుగా మూడో అంతస్తుమీదినుంచీ, పాకశాలకిటికీల్లోనుంచీ బయట ఆక్రమణం చేస్తున్న తురకతండాలమీద ఇటికరాళ్ల వాన కురియడం ఆరంభించింది. ఈవిపత్సమయంలో ఏమి చేయడానికీ పాలుపోక కొట్టుకొంటూఉన్న విద్యార్థులు లోనగువారికి తురకలే పథప్రదర్శకులై మహోపకారం జేశారు. ప్రాణాలను రక్షించుకోడానికి వేరోమార్గం గానక లోపలివాళ్లందరూ బయటితురకల మార్గం అవలంబించడానికే నిశ్చయించుకొన్నారనుకొంటాను. లోపలనుంచికూడా బయటివాళ్లమీద రాళ్లవాన ఆరంభించింది. వాటిని దీసికొని తురకలు మళ్లీ మందిరంవాళ్లమీద రువ్వడం మొదలెట్టారు. కాని ఎత్తుగా ఉండడంవల్ల పైవాళ్లకు తగిలేవికావు. మీదినుంచి వచ్చే ఇటుకలప్రహారాలుమాత్రం క్రిందగుంపులో పడడం మూలాన్ని ఎవరికో ఒకరికి తగులుతూవచ్చాయి. ఈపని ఆరంభమైన రెండుమూడు నిమిషాల్లో మందిరంముందరిభాగమంతా ఖాళీఅయిపోయింది. వెలుపలినుండి కురిసే యిటుకలవర్షం స్తంభించింది. తురకలమూకలు ఆక్రమణం మాని మందిరంలోనుంచి వచ్చే ఇటుకలను తప్పించుకోడానికి దూరంగా పోయి నిలుచొని పండ్లుకొరకడం మొదలెట్టారు. ఇంతలో పోలీసుసిబ్బంది పోగైంది. సబ్ఇన్‌స్పెక్టర్లందరూ గుర్రాలుదిగి మందిరంముందు చేరి తలుపులు తెరవమన్నారు. పోలీసువాళ్లు వచ్చారనే ధైర్యంతో లోపలివాళ్లు తలుపులు తెరచారు. ఇంతవరకూ ఏలాగో ప్రాణాలని రక్షించుకొన్నాము; ఇక మనరక్షకులు వచ్చారు. మనలని తప్పకుండా రక్షిస్తారు. అని సంతోషపడ్డారు గుళ్లోవాళ్లందరూ. కాని తలుపులు తెరవంగానే వీరనుకొన్నదానికి భిన్నంగా జరిగింది. పోలీసువాళ్లు లోపల ప్రవేశించి ఊరేగింపుమీద రాళ్లువేశారనే నేరం మోపి అక్కడ ఉన్న వాళ్లందరినీ అరెస్టుచేయడం ప్రారంభించారు. పాపం మందిరంవాళ్లు ఒకచావునుంచి తప్పించుకొంటే మరోచావు వచ్చింది. గుడి తురకలచేతుల్లో పడడం తప్పిపోయి పోలీసుచేతుల్లో బడింది. నలుగురైదుగురు తప్ప తక్కినవాళ్లంతా పడుచుటికి ముక్కేవాళ్లే. తమవాళ్ల కోట్లో పడడానికి తీర్థసిద్ధమైన చెరకుముక్క—నీ మందిరంవాళ్లు ఎగరగొట్టేశారు కదా అని వీళ్లకు కాఫర్లమీద కోపం రావడం స్వభావానికి విరుద్ధం గాదు. కాని ఈ ఉక్రోషాన్ని లోలోపల మింగుకోవలసిందేకాని బయటికి వెల్లడిచేయడం ఏలాగా? ఏప్రకారమైతేనేమి, వీళ్లు నోళ్లులేని విద్యార్థులమీద చేయిజేసుకొనీ, గదులు వెదకాలనే నెపంతో తలుపులను బద్దలుకొట్టీ, కిటికీలను పొడుజేసీ, బీరువాలను నాశనంజేసీ, తమకసిని దీర్చుకొన్నారు. మూలమూలలా వెదకి అయినవాళ్లనీ కానివాళ్లనీ కంటికి గనబడ్డవాళ్లందరినీ పట్టుకొనివచ్చి ఒకచోట గర్భగుడికి ప్రక్కగానె కూర్చోబెట్టారు. ఈరక్షకవర్గమువారి అంతర్యామిత్వము, సర్వజ్ఞత్వము నెంతని పొగడాలి! ఏంజరుగుతుందో చూద్దామని అక్కడికి వచ్చినా వస్తే యీసర్వజ్ఞులు వాళ్లనుగూడా గుళ్లోవాళ్లకిందగట్టి పట్టుకొన్నారు. తమప్రాణాలనిమిత్తం ప్రయత్నించిన యీమహాపరాధులమట్టూ ఈఅంతర్యామిలపహారా. నిజం విచారింపగలిగేవాళ్లుంటే ఆసమయాన్ని ఈరక్షకభటులున్నూ, వీరి అనుయాయులున్నూ గావించిన దుర్నయాలూ, దుండగాలూ గుళ్లోవాళ్లు చేసినదానికంటె వందరెట్లెక్కువని గ్రహించియుంటారు—కాని విచారించే దెవరు? వీళ్లు చేయడం మొదలిడింది న్యాయంకాదని ఎందరో వాదించారు. అందువల్ల లాభం లేకపోగా వేడుకొన్నారు. కాని వీళ్లకు వినాలనివుంటేగా! ఎవరెంత బతిమాలుకొన్నా వినేమిరా. ఆఖరికి ఈపట్టుకొన్నవాళ్లందరినీ అనార్కలీ జైల్లో ప్రవేశపెట్టాలనుకొన్నారు. పాపం, వీళ్లలో అధ్యాపకులూ, మందిరం విద్యార్థులూ, పరీక్షలకు వచ్చినవాళ్లూ, దేవీదర్శనానికి వచ్చినగృహస్థులూ, హఠాత్తుగా వచ్చి చిక్కుబడ్డవాళ్లూ నూటముప్పై మందికంటె ఎక్కువగా ఉన్నారు. తురకలకు బదులుచెప్పడం వీళ్లు చేసింది అపరాధమే అయినయెడల అట్టిఅపరాధులు వీరిలో కేవలం కొద్దిమందే; నిరపరాధులే యెక్కువ. కాని అందరినీ ఒకేచిత్తంతో తోలారు. మహాంతులవారిని మాత్రం మంచిదిగ్గాలోచనజేసి వదిలారనుకొంటాను. వీరినిగూడా పట్టుకెళ్లితే తరువాత జరిగే తంతు అంతా ఏలాగు జరగాలి?

షుమారు ఏడుగంటలయింది. దీపాలన్నీ వెలుగుతున్నాయి. మామూలుగా ఈవేళటప్పుడు అనార్కలీని చూస్తే నిజంగా అనార్కలీని (దానిమ్మకలిక) చూసినలాగే ఆనందం కలుగుతుంటుంది. పగలు పనిపాటలకు వెళ్లినవాళ్లంతా ఈసమయాన్నే పోగవుతారు, కావలసిన సామాన్లను కొనుక్కోడానికి. మేములుకూడా, తమవాళ్ల లిమిటెడ్ షాపుల్లోకి వెళ్లితే వస్తువుల కెక్కువఖరీదు ఇవ్వవలసివస్తుందనీ, వల్లవాళ్ల షాపుల్లో వాళ్లుచెప్పేధరలకుగాక సగానికి దింపి యీవస్తువును కొన్నప్పటికీ అక్కడకంటె చౌగ్గా ఉంటుందనీ, అనార్కలీకి దర్శన

మిస్తూవుంటారు. అదీగాక, నల్ల వాళ్ల షాపుల్లో దొరకే సలాంబిస్కట్లూ, వినయసత్కారాలచాపాతీలు దొరసాన్లకు వాళ్ల వాళ్ల షాపుల్లో దొరకవు. అందువల్ల బజారంతా టాక్సీలూ, మోటారుసైకిళ్లూ, జట్కాలు లోనగువానితో నిండివుంటుంది. జనసమ్మర్దము మూలాన్ని వీధిలో రావడంపోవడంకూడా కష్టంగా ఉంటుంది. ఎలెక్ట్రిక్ గాసు దీపాలు వీధినంతా పగటికింద మార్చేస్తాయి-అట్టి యీసుందరమైనవీధి మే నెల మూడవతారీఖు సాయంకాల మేడుగంటలవేళ శోకాక్రాంతయగు యువతీ ముఖంలాగు కళావిహీనమైపోయింది. శీతలామందిరాన్ని పోలీసువాళ్లాక్రమించుకోగానే అక్కడనుంచి మొగల ముందుకుసాగిన శిక్కుల యూరేగింపు ఈ వీధిగుండానే పోయింది. అందుకు తగిన చిహ్నాలు బాజారంతటా అగపడుతూ వున్నాయి. ఒక్కషాపైనా తెరచిలేదు. రోడ్డుమీద పోలీసువాళ్లుతప్ప ఇంకెవ్వళ్లూ లేరు. కొన్ని షాపులముందు తుత్తుమురుగా పగిలిపడివున్న లిమొనేడ్ సోడాకు సీసాలముప్పలూ, మరి కొన్నింటిముందు తలక్రిందుగా బోర్లబడి చెల్లాచెదరుగ బడివున్న పగిలిన జాచ్చెక్కపెట్టెలూ,లూ చైనకాఫీహోటళ్లూ వీటిన్నింటిని జూస్తే ఎంతలో ఎంత సుందరమైనవీధికి ఎట్టిపాటు సంప్రాప్తించిన దుఃఖం పొంగి వచ్చింది. ఈసందర్భంలో గొప్పగొప్పషాపుల కేమీనష్టం లేదు. వాళ్లు ముందుగానే మేలుకొని తగినయేర్పాట్లు చేసుకొన్నారు. ఎటు వచ్చీ పాడైనవి లిమ్నేడ్ సోడాషాపులూ, తమలపాకుబీడాలదుకాణాలూ, కాఫీహోటళ్లూ, మాంసహోటళ్లూ. ఈసమయంలో మరోతమాషా జరిగింది. అసలు తప్పుచేసినవాళ్లు కాలికి బుద్ధిచెబితే పారిపోక నిలుచున్న నిరపరాధులనే పట్టుకోవలసివచ్చేది పోలీసువాళ్లకి. దంగాజరిగే సమయంలో రెండుపక్షాలవాళ్లూ ఒకళ్లూఒకళ్లూ తన్నుకొనేవాళ్లు. ఇంతలో పోలీసువాళ్లు వస్తున్నారని తెలియడంతోటే బయటివాళ్లు పటాపంచలయ్యేవాళ్లు. దుకాందార్లు,వాళ్ల నౌకర్లూ నిలవబడిపోయ్యేవాళ్లు. లూటీచెయ్యడానికొచ్చిన బయటివాళ్లంటే పరిగెత్తుతారుగాని అసలు షాపులవాళ్లు ఏలాగూ పరిగెత్తేదీ? ఫలానిషాపులో దంగా జరుగుతూ ఉందని గుర్తుపెట్టుకొని వచ్చే పోలీసువాళ్లు షాపును సమీపించి అక్కడ పారిపోక నిలుచున్నవాళ్లే పోట్లాడుకొంటూ తామగటికి రాగానే మానేశారని వాళ్లనే అరెస్టుచేశేవాళ్లు. పారిపోయేవాళ్లు వీళ్లకంటికి అగపడరా అంటే అగపడతారు. వాళ్లెవరైందికూడా తెలుసూ. కాని పరిగెత్తినవాళ్లని పట్టుకోడం ఏలాగా? వాళ్ల వెంటబడి సందుగొందులన్నీ తిరగమంటారా ఏమిటి— సునాయాసంగా పట్టుకోడానికి కావలసినంతమంది ఎదట నిలబడివుంటే? పోట్లాట అయిన రెండు మూడురోజులతర్వాత అనార్కలీజైలుకి పోయిచూస్తే నూటికితొంభై మంది షాపులవాళ్లూ,హోటలువాళ్లూ,వాళ్ల నౌకర్లూ, వీళ్లే కనిపించారు. శీతలామందిరంవాళ్లు పట్టుబడిందీ ఈలాగే. బయటివాళ్లు బయట పరిగెత్తితే లోపలివాళ్లు లోపల పట్టుబడ్డారు. వీళ్లందరినీ షుమారు ఎనిమిదిగంటలకు అనార్కలీజైల్లో ప్రవేశంజేయించి, ఒకగంటవరకూ బయటవసారాలో కూర్చుండబెట్టి, తరువాత వీళ్లు తమగదులను ఖాళీ చేసి యిచ్చి అతిథిసత్కారపుణ్యాన్నిమటుకు కాజేశారు. ఆరాత్రి అక్కడున్నవాళ్లందరూ మందిరంవాళ్లే. ఒకరూఇద్దరూ అయితే కష్టమనిపించేదేమో. నలుగురితోచావు పెండ్లితో సమానం. ఇంత మందిలో కష్టమేమిటి? ఆవేళ కారాగృహాన్నే మందిరమని భావించుకొన్నారు. కాని మందిరంలోలాగు భోజనం దొరికింది కాదు. విద్యార్థులకు మార్నాటి పరీక్షచింత పట్టుకొంది. పాపం, వీళ్లకు సంవత్సరం పాడైందన్నమాటే.ఏమైతేనేం-పన్నెండుగంటలవరకూ గప్పాలుకొట్టుకొంటూ కాలం గడిపి తరువాత అందరూ నిద్రాదేవికి వశులయ్యారు.

మర్నాడు తెల్లవారేసరికి లాహోరు స్థితిగతులు భీభత్సంగా మారిపోయినాయి. కడచినరాత్రి జరిగిన బీభత్సకరములైన దౌర్జన్యాలను గూర్చి విస్తారంగా వ్రాయడం అనవసరం. తరువాత ప్రకటితమైన "ప్రతాప" అనే లాహోరులోని ఉర్దూదైనికపత్రిక శీతలామందిరానికి ఎదురుగుండా శాహ్మీ లోహారీ దర్వాజాలమధ్య ఉన్న గోల్ బాగ్ రోడ్డు ఆనాటిరాత్రి శైబరుకనుముగా మారిందని వ్రాసింది. దీన్నిబట్టి ఆదౌర్జన్యాల పరిమాణాన్ని కొంచెం గ్రహించుకోవచ్చు. జైలుకి వెళ్లిన వాళ్లే నిశ్చయంగా కాలాన్ని వెళ్లబుచ్చారు. మందిరంలో మిగిలిన ఇద్దరు ముగ్గురూ ప్రాణాల్ని అరచేతుల్లో బెట్టుకొని గడిపారు రాత్రి అంతా. ఎప్పుడూ నూరు నూటయాభైమందికి తక్కువ కాకుండా ఉండే ప్రదేశంలో, నాలుగుజైపుగా మహాగంభీరఘోరంగా ఉన్న సమయంలో ఇద్దరు ముగ్గురు బిక్కుబిక్కుమంటూ ఉండాలంటే వాళ్లస్థితి అనుభవించినవాళ్లకే గాని ఇంకోళ్లకు తెలియదు. తలుపులన్నింటినీ బిగించి, ప్రాణాల్ని భగవంతుడికి అర్పించి కూర్చున్నారు, నిద్రకు తిలాంజలి ఇచ్చి. రాత్రంతా మందిరానికి ఎదురుగుండా తన్నులు తినేవాళ్ల ఆక్రందన రోదనాలు చెవులు మూసుకొన్నా వినిపిస్తూనే ఉన్నాయి. ఇళ్లని వదలి బయటికి రానివాళ్లే అదృష్టవంతులు. విధిలేక రావలసి వచ్చిందా, తన్నులు తిన్నారన్నమాటే. తన్నులేమిటి? కైడీలని చెరావుదెబ్బలతో వీపంతా బద్దలై నెత్తురు కారుతూఉంటే తల దిమ్మెక్కి క్రిందపడిపోయేవాళ్లు. అంత అకింక బద్ధవాళ్ళని మరినాలుగు తన్నులుతన్ని ఏపులేకుండా బరిగెత్తేవాళ్లు గుండాలు. ఈతన్నేవాళ్లూ, తన్నులు తినేవాళ్లూ,హిందువులా తురకలా అంటే ఆ సర్వేశ్వరుడికే తెలియాలి. కాని మర్నాడు తెల్లవారంగానే రాత్రి మావాళ్లని హిందువులు చావకొట్టారని తురకలూ, వీళ్లే మావాళ్లని చావచన్నారని హిందువులూ మొదలుబెట్టుకొంటారు. ఆకాళరాత్రి ఇలాటి ఘటనాల్లోటే సెలవుపుచ్చుకుంది. తెల్లవారింది. చేతులతిమ్మిరి వొదల్చేలాగు కావలసినంత పని దొరికిందిగదా అని చాలాసంతోషించారు పోలీసువాళ్లు. నాలుగోతారీఖునాడు లాహోరు నాలుగుమూలలా విజృంభించింది హిందూ మహమ్మదీయుల తాండవ సంరంభం. పొద్దున్నే లేవగానే వందల కొలది పోలీసువాళ్లు బార్లుగట్టి వెళ్లారు, రాత్రంతా మహాజాగ్రత్తతో నగరరక్షణము చేసిన రక్షకభటులను విడిపించడానికి. కేవలం కాపలా నిమిత్తం కొద్దిమంది మాత్రమే జైల్లో నిలచిపోయ్యారు. మందిరం,

నుంచి వచ్చిన విద్యార్థులు తెల్లవారంగానే లేచి ఎలాగో ఒకలాగు అవసర కృత్యాలను దీర్చుకొని- ముఖ్యంగా పరీక్షకు పోవలసిన వాళ్లు- ఎవళ్లయినా వచ్చి విడిపించుకొని పోతారా దైవమా అని వాకిళ్ల గుండా ఎదురుచూస్తూ కూర్చున్నారు. కాని వీళ్ల కోర్కెలేమీ ఫలించాయి కావు. పది గంటలు కొట్టారు. పాపం, కొందరి కళ్ల వెంట నీళ్లు కారడం మొదలెట్టాయి. జైల్లోకి రావలసివచ్చిందే అని వీళ్లకు లేశమాత్రమైనా దుఃఖము లేదు. సంవత్సరం పొడుగూనా నానాకష్టాలూపడి నిద్రాహారాలుకూడా త్యజించుకొని చేసిన ప్రయత్నమంతా ఒక్కగడియలో బూడిదలో కలిసిపోయిందిగదా అని పట్టరాని దుఃఖము వచ్చింది. కాని ఎవరేం చెయ్యగలరూ! గుండ్రాళ్లాంటి హేమాహేమీలందరూ ప్రవాహవేగానికి తట్టుకోలేక కొట్టుకొని పోతూవుంటే ఈ గడ్డిపోచలాంటి విద్యార్థులేం లెక్క? వీరి పరీక్షలేం లెక్క? అక్కడ పరీక్షాభవనంలో హాజరైన విద్యార్థులందరూ సమ్మెకట్టి డెస్కులకు ఎదురుగా లేచి నిలుచుని, పట్నంలో నిన్న జరిగిన ఉపద్రవంవల్ల తమతోటివాళ్లు చాలామంది పోలీసులచేత బట్టుబడి రాలేకపోవడంవలన పరీక్షను మరోదినానికి మార్చమని అధికార్లతో ఎదిరించి మాట్లాడి పేపర్లను రాయడం మానేశారు. కాని హఠాత్తుగా సంభవించినందువలన అప్పుడేలాంటి ప్రయత్నం చెయ్యడానికి అధికార్లకు వీల్లేక పోయింది. ఒకవేపు రాయడం మాని విద్యార్థులందరూ నిలుచున్నారు. అక్కడ ఉన్నవాళ్లకు ఏంచెయ్యడానికీ తోచకుండా ఉంది. పరీక్షకు ఆలస్యమైపోతూ ఉంది. ఇంతలో టెలిఫోను ఇచ్చారేమో, రిజిస్ట్రారుగారు ప్రత్యక్షమయ్యారు. వారు ఆరోజున అప్పటికే తక్కిన కేంద్రాల్లో పేపర్లు బయలుపడి పోతాయి కాబట్టి ఆనాటికి మాత్రం తానేమీ చేయజాలననిన్నీ, తక్కిన రెండురోజుల పరీక్షనూ పది హేనో తారీఖు వరకూ మార్చుతాననిన్నీ వాళ్లని శాంతంజేసి కూచోబెట్టారు రాయడానికి. అలాగే జరిగింది. కాని లాభం లేకపోయింది. రెండునెల్ల తర్వాత పరీక్షా పరిణామాలు బయటపడ్డప్పుడు పట్టుబడ్డవాళ్లలో చాలామంది తప్పిపోయింది యీనాలుగో పేపర్లోనే. వీరందరికీ రాత్రి శనివారం రాత్రిగానే కడచిపోయినందున మర్నాడు తెల్లవారింది మొదలుకొని కడుపులో ఎలకలు పరిగెత్తడం మొదలెట్టాయి. పదిగంటలయ్యేటప్పటికి పోలీసుసార్జెంటు ఇద్దరు ముగ్గురు జవాన్లతో వచ్చి సెనగపప్పు పంచిపెట్టడం మొదలిడితే వాటినే వీళ్లు అమృతోపమానంగా గ్రహించి ఉదరపూజను ఆరంభించారు. రాత్రి మేలుకొన్నంతవరకూ, తెల్లవారిన తర్వాత పోలీసువాళ్లు బయటికి వెళ్లేపర్యంతం వాళ్లీ మందిరముంపలిని నిష్ఠుర వాక్యాలతో ఎత్తిపొడుస్తూనే వచ్చారు. కాని వాటికి వీళ్లు జవాబియ్యక పోవడమే కాక అవసర ప్రహారాలవల్ల వీళ్లకు కోపోద్రేకాలు గూడా కలిగాయికావు. ఇదంతా సార్జెంటు కనిపెట్టే వున్నాడు. వీళ్ల మాటలూ వ్యవహారాలూ చూచి వీళ్లుపట్టి అమాయికులనుకొన్నాడు. కాని మందిరం మీద ఆక్రమణం జరిగేటప్పుడు వీళ్లు ఇటికరాళ్లతో తురకల తలలు ఎగరకొట్టడం జ్ఞాపకానికి రాగా ఇతని కటూ తోచకపొయ్యేది. చిట్టచివరకు వీళ్లను అమాయికులనే నిశ్చయపరచుకొన్నాడు. సెనగలను పంచిపెట్టేటప్పుడు వీళ్లు మహానందంతో ఎగబడి తీసికొని తినడాన్ని చూచి యీయన తనభావాన్ని బయటపెట్టాడు: ఎంతమందినో ఖైదీలను బట్టుకొని వచ్చాంగాని ఇంతసంతోషంగా సెనగలను గ్రహించిన వాళ్లని యింతవరకూ ఎక్కడా చూడలేదు- అని మెచ్చుకొన్నాడు.

వీళ్లందరూ అనార్కలీ జైల్లో ఉన్నారని మహంతుగారికిగాని, లాహోరు నివాసులకుగాని ఆనాటి మధ్యాహ్నమువరకు తెలిసింది కాదు. నాలుగో తారీఖు ఉదయం వీళ్లు పట్టుబడ్డ సమాచారం పట్నం అంతటా తెలిసిపోయింది. అప్పుడుమళ్లో వాళ్లనే కనుంది అనేక స్థలాల్లో ఉన్న జైళ్లకు పోయి విచారించడం మొదలెడితే రెండు ఝాములు దాటిన తర్వాత తెలిసింది, మందిరం వాళ్లంతా అనార్కలీ జైల్లో ఉన్నారని. మహంతు పంపిన మనిషి వచ్చి భగీరథ ప్రయత్నాలు చేస్తే మూడుగంటలవేళకు లోపలి కెళ్లి ఆమవాళ్లని జూడవచ్చుననిన్నీ, వాళ్లకు కావలసిన తినుబండారాలు దీసుకొచ్చి ఇవ్వొచ్చుననీ ఉత్తరువు దొరికింది. ఆయన లోపలి కెళ్లి వాళ్లందరినీ చూసి ఓదార్చి భోజనాల యేర్పాట్లు చేయడానికి మళ్లీ మందిరానికి వెళ్లాడు. ఏలాగైతేనేం, సాయంకాలమయ్యేసరికి అందరికీ భోజనాలు దొరికాయి. ముఖ్యాధ్యాపకు లక్కడ ఉన్నంతకాలం ఉపవాసం చెయ్యాలనుకొన్నారు కాని చాలా మంది చెప్పిన మీద రెండోనాటినుంచి పాలు పుచ్చుకున్నారు.

వీళ్లకు మొదటినాడు కొంచెం కష్టం కలిగింది కాని తర్వాత ఇంటికంటే అక్కడే హాయనిపించింది కొందమందికి. దానికి కారణమేమంటే, నాలుగో తేదీ ఉదయంనుంచి జైలుకు రిక్షాట్లబాచీలు రావడం మొదలెట్టి ఆనో తారీఖు సాయంకాలంవరకూ వస్తూనేవచ్చాయి. ఈరెండురోజుల్లోనే వీరిసంఖ్య ఏడెనిమిదవందలైంది. ఈవచ్చినవాళ్లు మూడువార్లంతా పైప్రకరణంలో వర్ణించినలాటివాళ్లే. వీళ్లుపట్టుబడ్డవిధానాలు కూడా అవ్వే. వందలకొలది జైల్లో ఉన్నప్పటికీ పట్నంలో అత్యాచారాలు తగ్గాయికావు. బయటజరిగే ఉపద్రవాల్నీ, జైల్లో ఉన్నవాళ్ల వ్యవహారాల్నీ పరకాయించి చూస్తే తోడేళ్లని విచ్చలవిడిగా వదలిపెట్టి గొర్రెలనీ, మేకల్నీ పోగుచేస్తున్నారా అనిపించేది. ఈ తోడేళ్లని బంధిస్తే ఒక్కరోజులోనే ఉపద్రవాలన్నీ అణగిపోయ్యేవి. కాని ఏం చెయ్యాలి? పోలీసులకు వశమైందికాదు. అదీకాక, ఒక్కరోజులోనే తమాషా అంతా అయిపోతే ఇక తర్వాత మజా ఏముంది? ఈసమాచారాలన్నీ లాహోరులో అందరికీ బాగా అవగతం కావడంతోటే జైల్లోవాళ్లందరూ ధర్మవీరులయ్యారు. వెంటనే సిటీలోని షాహుకారొకడు జైల్లోవాళ్లకందరికీ రెండుపూటలా భోజనం పంపడానికి నడుముకట్టాడు. ఇతన్నిచూచి మరిఇద్దరుసేట్లు ముందుకొచ్చారు. మందిరాన్నుంచి భోజనంరావడం ఇదివరకే మొదలైంది. పొద్దున్నే పాలు.

పదకొండుగంటలకు భోజనం. రెండు మూడు గంటలప్పుడు ఫలహారాలు. రాత్రి మళ్లీ భోజనం. ఇప్పుడు వీళ్లుండేది జైలా, అత్తగారిల్లా? లాహోరు వాసులు ఈ మామల్లను జేసుకోకుండా ఏర్పడ్డ కొత్తరకపు అల్లుళ్లు వీళ్లిప్పుడు. ఈవిపరీతజామాతృగణంలో ఆగర్భ శ్రీమంతులు మొదలుకొని పని పాటలు చేసుకొనేవాళ్ల పర్యంత మున్నారు. భాగ్యవంతుల ఆకలి మందగించింది, వీళ్లకు స్వేచ్ఛలేదని మనసుపోయి అన్నం సయించేది కాదు. కాని యీసంసారపు జంజాటాలన్నీ లేనివాళ్ల ఆకలి ద్విగుణం త్రిగుణమైంది. పైవాళ్లవంతుకూడా ఈరెండోవాళ్లే చెల్లిస్తూవచ్చారు. దొరికినన్నిసార్లు సమృద్ధిగా ఆరగించారు. మొదట మొదట కొంచెం కఠినంగా ఉన్నప్పటికీ పూర్వంవాళ్లంతా ఖైదీలపక్షం అవలంబించింది. మొదలుకొని పోలీసువాళ్లు కూడా మెల్లబడ్డారు. ఏలాగైనా మాట నెగ్గించుకోవాలని పోలీసులు చాలా ప్రయత్నం చేశారు. పట్టుకొని వచ్చిన వాళ్లలో కొందరిని అదిరించి బెదిరించి నేరాన్ని ఒప్పించి తమ పక్షం చేసుకోవాలని చాలా ప్రయాసపడ్డారు. కాని కార్యం లేక పోయింది. ఇక వాస్తవంగా తూష్ణీంభావం తాల్చి ప్రభుత్వపక్కే దేలాగని వీళ్లకేసువిచారణకు తారీఖులు వేశారు పట్టుకొచ్చినవాళ్లందరికీ కూడా. పోలీసువాళ్లవిధాన్ని తంటాలుపడుతూ ఉన్నా జైల్లోవాళ్ల పరిస్థితి పెరుగుమీగడలతో గడచిపోతూవచ్చింది. మరి రెండు రోజులు దాటిన తర్వాత వీళ్లమీదఉన్న ముసల్మాన్ సహాయకు బదిలీఅయి ఆస్థలాన్ని హిందూసిక్కు పోలీసు లాక్రమించారు. ఇందువల్ల నూతనజామాతలకు మరికొన్ని అవసరసౌకర్యాలు దొరికాయి. ఇప్పుడు కేవలం స్థలంగాని స్థలంలో ఉన్నామనే చింతేగాని వీళ్లకేవిధమైన బాధలూ లేవు. యూనివర్సిటీహాల్లో జరిగినసంగతులు తెలియగానే విద్యార్థులు చాలా సంతోషించారు. తప్పకుండా మొత్తం మార్కులు సంపాయించి పాసౌతా మనుకొన్నారు అప్పటికి. కాని పరిణామం పైనరాసినలాగే తేలింది తరువాత. పిదప రెండు రోజుల్లో పోలీసు వేటగాళ్లలో కూడా కొన్నిమార్పులు జరిగాయి. అంతవరకూ గొర్రెలూ మేకలూ మాత్రమే వస్తూఉండేవి గనక; వేటగాళ్లలో మార్పులు జరిగిం తర్వాత తోడేళ్లుకూడా రావడం మొదలెట్టాయి. ఇవన్నీ ఇలా ఉండగా, మార్షల్ లా భారవాహు లాహోరు నౌకలపర్యంతమూ తమ ఆధీనంలో ఉంచుకోడానికి మక్కువగా ఉందని వారి యభిలాషను వెల్లడించారు. ఈవార్త చెవిని బడేసరికి హిందూ మహమ్మదీయ గుండాల నడుములు విరిగిపోయాయి. కుంగిపోయి భూమిమీదబడి రోదనంచేయసాగారు వీళ్లు. అంతపర్యంతం అనుభవించిన ఆనందమే తమప్రారబ్ధంలో ఉందనుకొన్నారు. కృతయుగం పోయి కలికాలం వచ్చిందని భావించారు. పొద్దున్నే ఎనిమిది గంటలు గావడంతోటే సర్ మార్షల్ లా భారవాహు మెకీగాన్ మోటర్లమీద బహురూపులై విహరించడం మొదలిడేసరికి, పాపం, తోడేళ్లకు ప్రాప్తించినదుర్గతి ఏమని చెప్పాలి? మొగాలైనా పైకి చూపించడానికి వీల్లేకపోయింది. ఈమార్పులన్నింటి మూలాన్ని లాహోరు మళ్లీ కొంచెం శాంతి ముఖానికి తిరగడం ఆరంభించగానే పట్టుబడ్డ వాళ్లని జామీన్లమీద వదలడం మొదలెట్టారు సర్కారువాళ్లు. ఏదో పోలీసువాళ్లు అరెస్టుచేసి కేసుచేశారుగదా, కొంచెమైనా తంతు జరపకుండా వదిలిపెడితే గౌరవంగా ఉండదని, ఫలాని ఫలాని నాడు వచ్చి పోలీసుకచేరీలో దర్శన మివ్వమని ఆజ్ఞాపిస్తూ వదిలారు వీళ్లని సర్కారువారు.

మహంతుగారు ఇందు కోసం మొదటినుంచే కనిపెట్టుకొని ఉన్నారు కాబట్టి ఈసమాచారం తెలియగానే చప్పున వచ్చి పన్నెండు వేలరూపాయల జామీను ఇచ్చి తమవాళ్లనందరినీ విడిపించుకొని వచ్చారు.

ఇక వీరికి ద్రవ్యానికేం తక్కువ, మందిరందక్కింతర్వాత? ఇద్దరు హైకోర్టువకీళ్లని తగిలించేటప్పటికి ఛిన్నభిన్నమై దూదిపింజల్లాగు ఎగిరిపోయింది కేసూగీసూ. అసలు ఇక్కడ కేసేమిటి? ఇదీ ఒక తమాషా గాదూ? అన్నదమ్ములబంతులాట. ఈసమయాన్ని పైగంబరు భక్తుడొకడు గుళ్లోనించి రాళ్లు వేసినవాళ్లని గుర్తిస్తానని బయల్దేరాడు. అంత ఈకేసుకు సంబంధించినవాళ్లయితేనేం, సంబంధించని వాళ్లయితేనేం, మూడువందలమంది కట్టగట్టుకొని వెళ్లారు ఐడెంటిఫికేషన్ నిమిత్తం. వరుసలు దీరి ఈమూడువందలమందీ నిలుచుంటే ఆగుర్తించే పెద్దమనిషి వచ్చి వీరిందంతా కేసుకు సంబంధించని వాళ్లనే. కేసు వెంటనే కొట్టేశారు. మహంతులవారికి అపరిమితానందమైంది. ఇప్పుడు వారి దగ్గరికి ఎవరైనా వెళ్లారంటే దుర్గాదేవే తురకల ఆక్రమణాన్ని తప్పించిందనీ, కేసులో గెల్పించిందనీ నవ్వుతూ సెలవిస్తూఉంటారు: సందేహముండదు. కాని ఆనాడు విద్యార్థులమూలాన్ని శీతలామందిరం నిలిచిందని లాహోరువాళ్లంతా అంటారు.